RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 20 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శుక్రవారం 24-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోం..

2వ పేజీలో...

### కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన

ఢిల్లీ: దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఈ వార్తలను పూర్తిగా ఖండిస్తూ, సామాన్యులపై ఇంధన భారాన్ని మోపే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వంవద్ద లేదని స్పష్టంచేసింది. ఇంధన ధరలపెంపుపై వస్తున్న వార్తలు కేవలం పుకార్లు మాత్రమేనని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేఆలోచనగానీ, ప్రతిపాదన గానీ ప్రస్తుతానికి ప్రభుత్వం దగ్గర లేదు. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు' అని అధికారికంగా వెల్లడించింది.



ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు బలవంతంగా నడిపేందుకు యత్నాలు పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2వ పేజీలో...



## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె



## ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్..?

2వ పేజీలో...

### 27న సంచలన నిర్ణయం?

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇంతకాలం బయటకు రాని మాజీ సీఎం, ప్రతిపక్షనేత కేసీఆర్ ఒక్కసారిగా బయటకు వచ్చి అందరినీ షాక్‌కు గురిచేశారు. అంతటితో ఆగకుండా జగిత్యాలలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు హాజరై ఏకంగా గంటపాటు ప్రసంగించారు. గతంలో వరంగల్‌లో నిర్వహించిన సభలో కేవలం 10 నుంచి 20నిమిషాలలోపే ఆయన ప్రసంగం సాగింది. కానీ, ఈసారి కేసీఆర్ ముందస్తు ప్రణాళిక ప్రకారమే బహిరంగ సభకు హాజరైనట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొలువుదీరి రెండున్నరేండ్లు పూర్తయింది. ఇంతకాలం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఫాంహౌస్ నుంచే గమనిస్తున్న కేసీఆర్.. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పార్టీలో చేరిక సందర్భంగా బయటకు రావడంతో పాటే కాంగ్రెస్ పార్టీకి బలమైన సంకేతం పంపారు.



## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

2వ పేజీలో...

ఆర్టీసీ సమ్మెపై కేబినెట్ భేటీలో ప్రస్తావన

నేడు చర్చలు జరపాలని డిప్యూటీ సిఎంకు ఆదేశం

అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని శ్రీధర్ బాబు వినతి

హైదరాబాద్, ఏప్రిల్23 :ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎం సూచించారు. ఈక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు.. కార్మిక సంఘాలతో సమావేశం కానున్నారు. నర్సంపేటలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నేపథ్యంలో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇదిలా వుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి... సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు జరుపుతుందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



## పాలేరులో ప్రజల ముంగిటకే 'ప్రజా దర్బార్'

- రేపటి నుంచి నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిన మంత్రి పొంగులేటి
- ఒకే వేదికపైకి అధికార యంత్రాంగం
- క్షేత్రస్థాయిలోనే సమస్యలకు చెక్ పెట్టేలా వ్యూహం
- కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలకు స్వస్తి

ఖమ్మం బ్యూరో (తెలంగాణ వాణి): "ప్రభుత్వం అంటే ప్రజల కోసం.. ప్రజల వద్దకే పాలన" అనే ఇందిరమ్మ రాజ్యపు ఆశయాన్ని నిజం చేస్తూ పాలేరు నియోజకవర్గంలో సరికొత్త ప్రజా పాలన శకానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శ్రీకారం చుట్టారు. సామాన్యులు తమ చిన్న చిన్న సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే పని లేకుండా,..



## రేవంత్ రెడ్డి, జీవన్ రెడ్డిల మధ్య మాటల యుద్ధం

2వ పేజీలో...

కరీంనగర్, : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి ఉమ్మడి కరీంనగర్ జిల్లాపైనే ఉంది. సీనియర్ నాయకుడు, దశాబ్దాల పాటు కాంగ్రెస్ జెండా మోసిన జీవన్ రెడ్డి అనూహ్యంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జీవన్ రెడ్డిల మధ్య మొదలైన మాటల యుద్ధం ఇప్పుడు గత చరిత్రను తవ్వుకునే స్థాయికి చేరింది.భూపాలపల్లి బహిరంగ సభ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి, జీవన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి అన్యాయం చేసిందా? లేక పదవీ వ్యామోహమే ఆయన్ని మార్చిందా? అన్న కోణంలో రేవంత్ విమర్శలు సంధించారు.కాంగ్రెస్ పార్టీ 40 ఏళ్లుగా అన్ని విధాలా గౌరవించిందని, ఒక్క ఏడాది పదవి లేకపోయేసరికి ఆయన తట్టుకోలేక పార్టీ మారారని రేవంత్ ఎద్దేవా.. చేశారు.



## తమిళనాడులో ఓటేసిన సినీనటులు

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు

ఓటేసిన చిదంబరం, స్టాలిన్, ఉదయనిధి

2వ పేజీలో...



## నీటికి కటకట.. మండుతున్న సూరీడు..

2వ పేజీలో...

కరీంనగర్, : మానేరు జలాశయం.. కరీంనగర్, వరంగల్ జిల్లాలకు వరప్రదాయిని. ఖమ్మం, నల్గొండ జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తోంది. కానీ ఇప్పుడు అదే జలాశయం కరీంనగర్‌వాసులకు డంప్‌యార్డుగా మారుతోంది. ట్రాక్టర్లతో చెత్త, మట్టి, కూల్చిన ఇండ్ల డేట్రిటస్‌తో నింపేస్తున్నారు. వర్షాల సమయంలో ఈ వేస్ట్ నీటిలో కలిసిపోయి చేపలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. మరోవైపు పెరుగుతున్న మట్టి దిబ్బలతో జలాశయం నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఇది కేవలం పర్యావరణ ప్రమాదమే కాదు, నగరం తాగు, సాగు నీటికి సంబంధించిన పెద్ద సమస్య.మానేరు రిజర్వాయర్‌కు కరీంనగర్ మాత్రమే కాదు, ఉమ్మడి వరంగల్, సూర్యాపేట జిల్లాల్లోని పలు ప్రాంతాల రైతుల జీవనమే ఆధారపడి ఉంది. కానీ ఇటీవల కాలంలో నగరం అంతటి నుంచి తీసుకొచ్చే వేస్ట్ మట్టి, కూల్చిన భవనాల ధ్వంసాలు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో పేరుకుపోతున్నాయి.

వీటిని డ్యాం లోపలికి పోస్తే వర్షాలు పడగానే నీటిలో కలిసిపోయి అధోభాగంలో మట్టి పొరలు ఏర్పడుతున్నాయి. దీని ఫలితంగా నీటి నిల్వ కెపాసిటీ క్రమంగా పడిపోతోంది.దిగువ మానేరు డ్యామ్ మొత్తం నీటి నిల్వ సామర్థ్యం సుమారు 24 టీఎంసీలుగా ఉండగా, గత కొంత కాలంగా అది సగానికి పడిపోయే స్థితికి చేరుకుంటోంది.

- అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి వారికుంది
- రాణీగంజ్ డిపోముందు సంఘీభావం పలికిన తలసాని

హైదరాబాద్, ఏప్రిల్ 23 : ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని..



## తెలంగాణ సాధనలో ఆర్టీసి కార్మికులే కీలకం

2వ పేజీలో...

# రేవంత్ రెడ్డి, జీవన్ రెడ్డిల మధ్య మాటల యుద్ధం



మొదటిపేజీ తరువాయి...

1983లో ఒక సామాన్య లాయర్‌గా ఉన్న జీవన్ రెడ్డికి ఎన్టీఆర్ పిలిచి అవకాశం ఇచ్చి గెలిపించారని, కానీ ఏడాది తిరగకముందే నాదెండ్ల భాస్కర్ రావుతో చేతులు కలిపి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఆయనదని రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు. రాజకీయాల్లో విలువలు ముఖ్యమని, ఇలాంటి వెన్నుపోటు రాజకీయాలు జీవన్ రెడ్డి నైజమని రేవంత్ ధ్వజమెత్తారు. రేవంత్ విమర్శలపై జీవన్ రెడ్డి కూడా అదే స్థాయిలో స్పందించారు. ముఖ్యంగా నాదెండ్ల భాస్కర్ రావు ఎపిసోడ్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు ఆయన ధీటైన సమాధానం ఇచ్చారు. తనను ఎవరూ మంత్రి పదవి నుంచి తొలగించలేదని, నాదెండ్ల భాస్కర్ రావును ఎన్టీఆర్ తొలగించినప్పుడు నిరసనగా తానే స్వచ్ఛందంగా మంత్రి పదవికి రాజీనామా చేశానని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ రోజు నాదెండ్ల భాస్కర్ రావుకు కేవలం తాను మాత్రమే కాదు, సాక్షాత్తు ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అంతా మద్దతు ఇచ్చిందని రేవంత్ తెలుసుకోవాలని హితవు పలికారు. తన నిర్ణయం వెనుక వ్యక్తిగత స్వార్థం లేదని, నాడు పార్టీ తీసుకున్న నిర్ణయానికే తాను కట్టుబడి ఉన్నానని రేవంత్ వ్యాఖ్యల్లో సోయి లేదని విమర్శించారు. ఈ వివాదాన్ని గమనిస్తే ఇక్కడ ఇద్దరి వాదనల్లోనూ రాజకీయ ప్రయోజనాలే కనిపిస్తున్నాయి. జీవన్ రెడ్డి వెళ్లిపోవడం వల్ల పార్టీకి నష్టం లేదని కేడర్‌లో ధైర్యం నింపేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు.

అందుకే జీవన్ రెడ్డిని ఒక అవకాశవాదిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. మరోవైపు, జీవన్ రెడ్డి మాత్రం పార్టీలో తన ప్రాధాన్యత తగ్గిందని, తన సొంత నియోజకవర్గంలో తనకు తెలియకుండానే నిర్ణయాలు జరుగుతున్నాయన్న అసంతృప్తితోనే బయటకు రావాల్సి వచ్చిందని చెప్పుకొస్తున్నరా?. పాత చరిత్రను రేవంత్ తప్పుగా వాడుతున్నారని ఆయన వాదిస్తున్నారు. కాంగ్రెస్ గొడుగు కింద కలిసి పనిచేసిన ఈ ఇద్దరు నేతలు, ఇప్పుడు పరస్పర ఆరోపణలు చేసుకోవడం కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తోంది. జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. జీవన్ రెడ్డి చేరిక బీఆర్ఎస్‌కు ఏ మేరకు బలాన్నిస్తుంది? రేవంత్ రెడ్డి దూకుడు కాంగ్రెస్‌ను ఎలా కాపాడుతుంది? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# రెండో రోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్, ఏప్రిల్23 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పాలేరులో ప్రజల ముంగిటకే 'ప్రజా దర్బార్'

మొదటిపేజీ తరువాయి...

అధికారులందరినీ ప్రజల ముంగిట నిలబెట్టేలా క్షేత్రస్థాయిలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్ మొదలుకొని నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఒకే వేదికపైకి రానున్నారు. రెవెన్యూ, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల విజ్ఞప్తులు, కొత్త రేషన్ కార్డులు, స్థానిక మౌలిక సదుపాయాల వరకు.. ఏ రకమైన సమస్యకైనా తక్షణ పరిష్కారమే ధ్యేయంగా మంత్రి ఈ వేదికను తీర్చిదిద్దారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం విశేషం. రేపు నియోజకవర్గంలోని రెండు ప్రధాన కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నేలకొండపల్లి మండలం రాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు తొలి దర్బార్ జరుగుతుంది. ఈ కేంద్రానికి రాయిగూడెం, అజయ్‌తండా, చెరువు మాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీల ప్రజలు తమ సమస్యలతో హాజరుకావచ్చు. మధ్యాహ్నం 3:30 నుండి తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3:30 గంటల నుండి రాత్రి 7:30




వరకు రెండో వేదిక సిద్ధమైంది. ఈ కేంద్రానికి సుబ్లేడు, లక్ష్మీదేవిపల్లి తండా, రఘునాధపాలెం, హస్నాబాద్, ఇస్లావత్ తండా, మహమ్మదాపురం, మేకల తండా, మేడిదపల్లి, చంద్రు తండా, జోగులపాడు, పాతర్లపాడు, గోల్ తండా, జల్లెపల్లి గ్రామ పంచాయతీల ప్రజలు తరలి రానున్నారు. "తన నియోజకవర్గంలో ఏ ఒక్క పౌరుడు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగకూడదనే ఆకాంక్షతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను" అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అధికారులందరూ పూర్తి సమాచారంతో క్షేత్రస్థాయికి రావాలని ఆయన ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

# ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు కారిడార్

## డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫజక్‌కు చెక్ ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్23 : ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ - విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్ట్రక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా..త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్సల్టెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని నిర్ణయించారు. అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

# నీటికి కటకట.. మండుతున్న సూరీడు..



మొదటిపేజీ తరువాయి...

డెడ్ స్టోరేజీ కనీస స్థాయికి నీరు పడిపోతే తాగునీటి సమస్య మొదలవుతుంది. ఇప్పటికే కొన్ని సందర్భాల్లో నీటి మట్టం 6?7 టీఎంసీల మట్టికి పడిపోయి, నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డంపింగ్ వల్ల ఏర్పడే అవక్షేపాలు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది. మానేరు తీరంలోని నిత్యం డజన్ల కొద్దీ లారీల చెత్త తీసుకురావడం, డంప్ చేయడం జరుగుతోంది. చెత్తను కాల్చడం కూడా జరుగుతుండడంతో స్థానికులకు దట్టమైన పొగ, ఊపిరితిత్తుల సంబంధమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్లాస్టిక్, కెమికల్ వేస్ట్ వర్షపు నీటిలో కలిసి డ్యాం జలాలను కలుషితం చేసే అవకాశం ఉంది. ఇది కేవలం పర్యావరణ దుష్ప్రభావమే కాకుండా, తాగునీటి నాణ్యతపై నిశితమైన ప్రమాదాన్ని కూడా సృష్టిస్తుంది. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఈ డంపింగ్ ప్రాక్టీసుపై పూర్తి స్థాయి నిర్వహణ, ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఇంకా పనిబడటం లేదని విమర్శలు వస్తున్నాయి. నగరం వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడానికి సరైన డంపింగ్ యార్డ్, రీసైక్లింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయకుండా మానేరు ప్రాంతాన్ని "సులభ పరిష్కారం" లాగా ఉపయోగించడం పెద్ద విధాన లోపంగా కనిపిస్తోంది. ప్రజలు మాత్రం ప్రాణంగా భావించిన జలాశయం మట్టి గుట్టల కింద మునిగిపోకూడదని పటిష్టంగా డిమాండ్ చేస్తున్నారు. మానేరు రిజర్వాయర్‌ను కాపాడుకోవాలంటే ముందుగా దాని పరిసర ప్రాంతాల్లో చెత్త, మట్టి డంపింగ్‌ను నిషేధించాలి. నగర వ్యర్థాలను ఒక అనుమతితో కూడిన డంపింగ్ యార్డ్‌లో నిర్వహించడానికి స్థిరమైన ప్రణాళిక అవసరం. ఇప్పటికే ప్రారంభించిన బయోమైనింగ్, రీసైక్లింగ్ ప్రాజెక్టులతో పరిస్థితి మెరుగుపడుతుంది.

# ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్..?

మొదటిపేజీ తరువాయి...

వరుస బహిరంగ సభలు..: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని గులాబీ పార్టీ ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. జగిత్యాల సభతో వచ్చిన మైలేజీతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇంతకాలం ప్రభుత్వానికి సమయం ఇచ్చామని.. ఇక ఊరుకునేది లేదని గులాబీ కేడర్‌ను ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే పార్టీ బలోపేతం, భవిష్యత్ వ్యూహాలపై దృష్టి సారిస్తూ ఈనెల 27న మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో ముఖ్య సమావేశాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారు. అదే రోజున పార్టీ ఆవిర్భావ దినోత్సవం కావడం, రజతోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమాన్నీ నిర్వహించనున్నారు. దీనికి పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ ఆహ్వానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

కొత్త సభ్యత్వాలు.. పార్టీ బలోపేతం..: పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు గులాబీ బాస్ ఫోకస్ పెట్టారు. దీంతో 27న నిర్వహిస్తున్న భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నది. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల పునరుద్ధరణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చిస్తారని టాక్. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ కేడర్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి? సభ్యత్వ నమోదు ప్రక్రియను ఏ విధంగా వేగవంతం చేయాలి? అనే విషయాలపై దిశానిర్దేశం చేయనున్నారు. జిల్లా, మండల స్థాయిలోనూ పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించడం, నాయకత్వాన్ని చురుకుగా మార్చడం వంటి అంశాలు ఎజెండాలో ఉండనున్నట్టు తెలుస్తున్నది. కొత్త సభ్యులను ఆకర్షించడం, యువతను పార్టీలోకి తీసుకురావడం, గ్రామస్థాయి వరకు పార్టీ విస్తరణ జరగాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించే దిశగా కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని తెలుస్తున్నది.

వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాక్. అందులో భాగంగానే అన్ని జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ సభల ద్వారా పార్టీ శక్తిని ప్రదర్శించడంతో పాటు ప్రజలతో నేరుగా మమేకం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. ఈ బహిరంగ సభలు పార్టీకి మళ్లీ ఉత్సాహాన్ని నింపే అవకాశమున్నదని నేతలు భావిస్తున్నారు.

# తెలంగాణ సాధనలో ఆర్టీసి కార్మికులే కీలకం

మొదటిపేజీ తరువాయి...

ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

# తమిళనాడులో ఓటేసిన సినీనటులు

మొదటిపేజీ తరువాయి...

చెన్నై, ఏప్రిల్23 : తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు ప్రముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 37.56 శాతం ఓటింగ్ నమోదైంది. శివగంగ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఓటేశారు. భాజపా నేత ఖుష్బూ, నటి త్రిష ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలో ఓటేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుంచి పోటీలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన భార్య దుర్గా స్టాలిన్, వారి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఓటేశారు.

## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

మొదటిపేజీ తరువాయి...

ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని... ప్రభుత్వం తో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 24న అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన, 25న అన్ని డిపోల్లో వంటావార్పు, 26న జిల్లాల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు, 27న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత, అన్ని డిపోల్లో బతుకమ్మలతో మహిళా ఉద్యోగుల నిరసన, 29న డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోం..

మొదటిపేజీ తరువాయి...

ఏకైక దేశం భారత్..: అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, గత నాలుగేళ్లుగా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా నియంత్రించిన ఏకైక దేశం భారత్ అని మంత్రిత్వ శాఖ గర్వంగా ప్రకటించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇతర భౌగోళిక ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, భారత ప్రభుత్వం పౌరులపై భారం పడకుండా పన్నుల తగ్గింపు, ఇతర చర్యల ద్వారా ధరలను స్థిరంగా ఉంచగలిగిందని ట్వీట్ చేసింది.

సామాన్యులకు భారీ ఊరట..: ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ఇంధన ధరల పెంపు వార్తలు వాహనదారుల్లో ఆందోళన కలిగించాయి. అయితే, కేంద్రం ఇచ్చిన ఈ క్లారిటీతో సామాన్యులకు, రవాణా రంగానికి పెద్ద ఊరట లభించినట్లయింది. భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ ఒడిదుడుకుల నుంచి పౌరులను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పెట్రోలియం శాఖ హామీ ఇచ్చింది.

# సంపాదకీయం

## అదను చూసి దెబ్బకొట్టిన విపక్షాలు

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు బిల్లు వీగిపోయింది. అయితే ఈ సూత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ మేధోమథనానికి దారితీసింది. బిల్లు చారిత్రాత్మకం.. దేశంలో ఉన్న మహిళలకు లభిస్తున్న గౌరవం.. ఇకపై వారు మరింత సాధికారత సాధించవచ్చు. చట్టసభల్లో మరింత సమున్నతంగా కొనసాగవచ్చు.. భారత మహిళలు మరింత అభివృద్ధి చెందుతారని ఆశిస్తున్నాం.. ఇదీ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టసభల్లోకి వచ్చే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ మహిళలను ఉద్దేశించి రాసిన లేఖ.ఈ బిల్లు చర్చకు వచ్చే ముందు పార్లమెంట్లో విస్తృత సమావేశం జరిగింది. అధికార పక్షం నుంచి మొదలు పెడితే ప్రతిపక్షం వరకు నాయకులు తమ తమ వాణి వినిపించారు.. దీంతో చట్టసభల్లో మహిళ బిల్లు నెగ్గుతుందని.. మహిళలకు రిజర్వేషన్ వర్తిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ చారిత్రాత్మకమైన బిల్లు వీగిపోయింది. విపక్షాల ఐక్యత ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం తలవంచింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. విపక్షాల ఐక్యత ముందు తలవంచక తప్పలేదుఈ బిల్లు ఆమోదానికి మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. ఆ మెజారిటీని కూడగట్టడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైంది. దశాబ్దాలపాటు నెరవేరని కలగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు సహకారం కాలేదు.. శుక్రవారం పార్లమెంట్లో ఉత్కంఠ భరితమైన వాతావరణం మధ్య.. ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించారు. సభకు మొత్తం 528 మంది హాజరయ్యారు. అనుకూలంగా 298 మంది మాత్రమే ఓటు వేశారు. మిగతా 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి నోచుకోవాలంటే కనీసం 352 మంది సభ్యులు ఆమోదం తెలపాలి. మ్యాజిక్ ఫిగర్ పొందడానికి 54 ఓట్లు అవసరం. అయితే వారంతా వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో బిల్లును తిరస్కరించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.మొదటినుంచి కూడా డీలిమిటేషన్ చేపట్టాలని నిబంధన పై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ అమలుకు ముందు దీనిని చేపట్టాలనే ప్రభుత్వ నిబంధన పై మండిపడుతున్నాయి.. "ఇప్పుడు మీరెందుకు రిజర్వేషన్ అమలు చేయడం లేదు? భవిష్యత్ కాలంలో నిర్వహించే డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇది మహిళలకు గర్వభంగాన్ని కలిగించే అంశమని" విపక్షాలు కేంద్రంపై మండిపడుతున్నాయి. అంతేకాదు కీలకమైన ఓటింగ్ సమయంలో విపక్షాలు మొత్తం ఏకతాటిపైకి వచ్చాయి. అంతేకాదు, మిత్రపక్షాలను కూడా కేంద్రం ఒప్పించలేకపోవడం నరేంద్ర మోడీ వైఫల్యానికి నిదర్శనం అని విశ్లేషకులు అంటున్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన తర్వాత.. కేంద్రం వెంటనే అప్రమత్తమైంది. మహిళా రిజర్వేషన్లతో సంబంధం ఉన్న డీ లిమిటేషన్ బిల్లు 2026, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాల సవరణ బిల్లులు మొత్తం వెనక్కి తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి ప్రకటించడం విశేషం. వాస్తవానికి బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం ఒకరకంగా బలహీనతను నిరూపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.విపక్షాలు ఎన్నడూ లేనంతగా ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. దీనిని పసిగట్టడంలో అధికార పక్షం విఫలమైంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు అమలవుతాయా.. ఇంకా కొంతకాలం ఇలానే ఉంటుందా.. అనే సందిగ్ధం కొనసాగుతూనే ఉంది.కాకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోకపోవడంతో.. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మహిళల ప్రభావం ఎన్నికల మీద పడుతుందని తెలుస్తోంది. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పటితోనే కేంద్రం నిలిపి వేస్తుందా.. ఎన్నికలకు ముందు కొత్త సొంతం ముందుకు వస్తుందా.. విపక్షాల ఒత్తిడికి తలవంచుతుందా.. డీలిమిటేషన్ నిబంధన తొలగించి.. తాజాగా కొత్త బిల్లు ప్రవేశపెడుతుందా.. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.జనాభా ప్రాతిపదికన మాత్రమే పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం దారుణంగా పడిపోతుందన్న ఆందోళనలతో కేంద్రం ప్రతిపాదించిన ఈ ప్రోరాటా పద్ధతి ఏ మేరకు సమన్యాయం చేకూరుస్తుందనే దానిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. అమిత్ షా ప్రతిపాదించిన ఫార్ములాలోని ప్రధానాంశం ఏమిటంటే.. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను కచ్చితంగా 50 శాతం మేర పెంచడం. దీనివల్ల రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తి ఏమాత్రం మారదు. ఉదాహరణకు, లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉంది. అన్ని రాష్ట్రాల్లోనూ సీట్లు 50 శాతం పెరిగినప్పుడు, మొత్తం సీట్ల సంఖ్య పెరిగినా దక్షిణాది రాష్ట్రాల వాటా అదే 24 శాతంగా కొనసాగుతుంది. తద్వారా జనాభా నియంత్రణ పాటించినందుకు ఏ రాష్ట్రమూ తన రాజకీయ బలాన్ని కోల్పోదని కేంద్రం భరోసా ఇస్తోంది.ఈ ప్రోరాటా పద్ధతి ఒక మధ్యేమార్గం . కేవలం 2021/2026 జనాభా లెక్కల ఆధారంగా సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది ప్రాబల్యం 18–20 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. కానీ, ఈ 50 శాతం పెంపుదల సూత్రం వల్ల ఉత్తరప్రదేశ్ లేదా బీహార్ వంటి రాష్ట్రాలకు అదనపు ప్రయోజనం కలగదు, అలాగే కేరళ లేదా తమిళనాడు వంటి రాష్ట్రాలకు నష్టం వాటిల్లదు. అంటే, పార్లమెంటులో ఒక బిల్లును ఆమోదించుకోవడానికి అవసరమైన ఓట్ల శాతంలో దక్షిణాది రాష్ట్రాల బలం యథాతథంగా ఉంటుంది.అయితే, ఇక్కడ ఒక చిన్న మెలిక ఉందని కొందరు నిపుణులు విశ్లేషిస్తున్నారు. శాతం పరంగా వాటా మారకపోయినా, సంఖ్యాపరంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కువగా ఉంటాయి. . 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణన ఆధారంగా కొత్త నియోజకవర్గాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానుంది.ముందున్న రోజుల్లో డీలిమిటేషన్ అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాకుండా, ఫెడరల్ స్ఫూర్తికి సంబంధించిన అంశంగా మారనుంది. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా సమాన ప్రాతినిధ్యం ఎలా కల్పిస్తారనేది ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలు. ఈ ప్రక్రియపై రాజకీయ ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ భవిష్యత్తు మరియు రాష్ట్రాల హక్కుల మధ్య సమతుల్యతను కాపాడటమే ఈ పునర్విభజన అసలు లక్ష్యం కావాలని ప్రజలు కోరుకుంటున్నారుఅయితే, ఈ ప్రక్రియను రాజ్యాంగబద్ధంగా ఎలా అమలు చేస్తారు? ఆర్టికల్ 82ను ఎలా సవరిస్తారు? అనే సాంకేతిక అంశాలపై ప్రభుత్వం ఇచ్చే వివరణపైనే ఈ ఫార్ములా విజయం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతానికి మాత్రం, ప్రోరాటా పద్ధతి దక్షిణాది ప్రయోజనాలకు ఒక రక్షణ కవచంగా కనిపిస్తోంది.

## ముల్కనూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం



చిగురుమామిడి (తెలంగాణ వాణి) మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు బి. శారద ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య పై తరగతులకు వెళ్లే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి విద్యార్థులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులుకు వివరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పైడిపల్లి స్వర్ణలత, ఉపాధ్యాయులు భవాని, అనిత, రమ్య, మమత, ఉపాద్యాయులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

అనంతరం ముల్కనూర్ అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో దొబ్బల మావురవ్వ ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను ప్రారంభించారు.

## జగిత్యాల క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో కలకలం

**ఆభరణాల మాయంపై బంధువుల ఆందోళన**



జగిత్యాల: ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి) :జగిత్యాల పట్టణంలోని ఎం సి హెచ్ ప్రాంగణంలోని క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో ఓ రోగి చికిత్స పొందుతూ మృతి చెందగా, రోగి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఆందోళన పట్టణంలో చర్చానీయాంశంగా మారింది. కొడిమ్యాల మండలం నాచుపల్లి కి చెందిన ఓ మహిళ విషమ పరిస్థితిలో ఉండగా, బంధువులు క్రిటికల్ కేర్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె పరిస్థితి విషమించి, మృతి చెందగా, క్రిటికల్ కేర్ లో చేరిన సమయంలో ఆమెపై ఉన్న బంగారు నగలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జగిత్యాల టౌన్ పిఎస్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



జగిత్యాల: ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, అధ్యక్షులు గాజంగి నందయ్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## తమ్మినేనికీ శుభాకాంక్షలు తెలిపిన "పొన్నెకంటి"



కొత్తగూడెం (తెలంగాణ వాణి) సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం ను సత్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నగంటి సంజీవరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మూడు రోజులపాటు కొత్తగూడెంలో జరుగుతున్న రాష్ట్ర రైతు సంఘం సమావేశాలు హాజరైన తమ్మినేని వీరభద్రం కలిసి పూల బొకేను అందించారు. అంతేకాకుండా ఆయన ఆరోగ్య పరిస్థితులను సంజీవరాజు అడిగి తెలుసుకున్నారు.

# సింగరేణి బకాయిలను చెల్లించాలి

**- కార్పొరేట్ మెడికల్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలి**

**- సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ జాతీయ నేత మాధవ నాయక్**





కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రు. 50వేల కోట్లను వెంటనే చెల్లించి సంస్థ మనుగడను కాపాడాలని బిఎంఎస్ అనుబంధ ఏబికేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి మాధవ నాయక్ పేర్కొన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని పద్మావతి ఖని వద్ద సింగరేణి కోల్ మైండ్ స్టార్మిక సంఘ్ ఆధ్వర్యంలో నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ నాయకులు, కార్మికులతో సమావేశమయ్యా రు. ఈసందర్భంగా మాధవ నాయక్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలు అయిన టీఎస్– జన్ కో, టీఎస్ ట్రాన్స్కో కు నిరంతరం బొగ్గు, విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ, సంబంధిత సంస్థలు చెల్లింపులను చేయకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. ప్రస్తుతం టీఎస్ జెన్కో వద్ద బొగ్గు సరాపర బకాయిలు సుమారు రూ. 20,000 కోట్లు, టీఎస్ ట్రాన్స్కో ( టీఎస్పీ సిసి) వద్ద విద్యుత్ సరఫరా బకాయిలు సుమారు రూ. 30,000 కోట్లు బకాయిలు పేరుకుపపోయి మొత్తం బకాయిలు రూ. 50,000 కోట్లకు పైగాచేరుకున్నాయని పేర్కొన్నారు. ఈ భారీబకాయిల కారణం గా సింగరేణి పై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగేఉద్యోగుల జీతాలు, భద్రత పరికరాలు, పన్నులు, కాంట్రాక్ట్ ఖర్చులు, సరఫరాదారుల చెల్లింపులు, విస్తరణ కార్యక్రమా లకు అవసరమైన పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడుతోందని వివరించారు. కార్పొరేట్ మెడికల్ బోర్డు నిలుపుదలపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో యాజమా న్యం తక్షణమే కార్పొరేట్ మెడికల్ బోర్డును పునరుద్ధరించి సేవలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో కార్మికు లు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘం డిమాండ్లకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్. పవన్ కుమార్, లట్టి జగన్మోహన్, జి. వెంకటరెడ్డి,నాగేశ్వరరావు, మొగిలిపాక రవి, జి. గోపికృష్ణ, బి. రాజేష్, రంజిత్, ఆత్రేయ, ఎం. సుధాకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుల్ని నట్టేట ముంచిన ప్రజాపాలన

**మొక్కజొన్న రైతుల్ని నట్టేట ముంచిన ప్రజాపాలన**

**నల్లబెల్లి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ ధర్నా**



నల్లబెల్లి: ప్రజాపాలన పేరుతో రైతులను తీవ్రంగా నష్టపెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో వరంగల్ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నసుదర్శన్ రెడ్డి పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై అవగాహన లేని ప్రభుత్వ పాలన వల్లే మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 35 వేల బస్తాలు తరలింపుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, లారీలు సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గత ఇరవై రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతూ మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఎకరాకు కేవలం 25 క్వింటాళ్ల పంటనే కొనుగోలు చేసి, మిగిలిన సరుకును రైతులు దళారులకు అమ్ముకునేలా ప్రభుత్వం నెట్టేస్తోందని విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన? ఇదేనా రైతు సంక్షేమం? అంటూ ప్రశ్నించారు. వ్యవసాయ రంగంపై అనుభవం లేని రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థతే ఈ పరిస్థితికి కారణమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ల నుంచి మద్దతు ధర వరకు అన్ని సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అందించిన పోలీసులు



**మొబైల్ ఫోన్ లో పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలి**

**జిల్లా ఎస్పి కేకన్ సుధీర్ రామనాథ్**

ములుగు(తెలంగాణ వాణి) ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న భాధితులు ఆన్లైన్ (సిఈఐఆర్ పోర్టల్ ) ద్వారా ఫిర్యాదు చేయగా ఫిర్యాదు నమోదు చేసుకున్న స్టేషన్ సిబ్బంది, వాటిని తిరిగి బాధితులకు అప్పగించడంలో భాగంగా ములుగు ఐటీ కోర్ టీం సహాయంతో ఈ నెలలో మిస్సైన 25 మొబైల్ ఫోన్లను విజయవంతంగా గుర్తించి, వాటిని గురువారం రోజు బాధితులకు ఎస్పి చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ సందర్భంగా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు ఐటి కోర్ టీమ్ ను ఎస్పీ అభినందించారు. వారి కృషి వల్ల తక్కువ సమయంలోనే మొబైల్ ఫోన్లు తిరిగి సాధించగలిగామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందికి మిస్సింగ్ మొబైల్స్ రికవరీపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు తమ వ్యక్తిగత వస్తువుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని, మొబైల్ ఫోన్లు కోల్పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేసుకోని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# 'అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం'

**- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**- అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ**



బూర్గంపహాడ్, : అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునీకరించడంతో పాటు అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల విధుల్లో ఆధునీకతను జోడించే దిశగా ఈ స్మార్ట్ ఫోన్లను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వీటివల్ల అంగన్‌వాడీలకు సేవలు సులభతరంగా ఉండటంతో పాటు పారదర్శకంగా ఉండేలా ఉపయోగపడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల్లో వేగం పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా పారదర్శకంగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే వీలుంటుందన్నారు. అనంతరం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లను సీడీపీఓ రేవతితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ రేవతి, సర్పంచులు కిషోర్‌నాయక్, మందా నాగరాజు, ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, ఈఓ మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్థానిక నాయకులు భజన సతీష్, ప్రసాద్, ఇంగువ రమేష్, మహిమూదాఖాన్, పూలపెల్లి సుధాకర్రెడ్డి, మండలంలోని అన్ని కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ 2026 పరీక్షల రెండో విడత షెడ్యూల్ విడుదల

ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ పదవ తరగతి రెండో విడత (ఫేస్ 2) బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడానికి, ఫలితాలను మెరుగుపరుచుకునేందుకు బోర్డు ప్రవేశపెట్టిన ఈ నూతన విధానం ప్రకారం, ఇంప్రూవ్‌మెంట్, కంపార్ట్‌మెంట్ పరీక్షలు మే నెలలో జరగనున్నాయి. మే 15 నుంచి ప్రారంభమై మే 30 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎవరు అర్హులు..: ఫిబ్రవరి/మార్చిలో జరిగిన మొదటి బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణులై, తమ మార్కులను మెరుగు పరచు కావాలనుకునే విద్యార్థులు (గరిష్టంగా మూడు సబ్జెక్టుల వరకు). కంపార్ట్‌మెంట్ కేటగిరీలో నిలిచిన విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకావచ్చు. ఈ పరీక్షల కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ. 320 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండో విడత పరీక్షలు జూన్ మొదటి వారంతో ముగుస్తాయి. ఫలితాలు జూన్‌ఆఖరు లేదా జూలైమొదటి వారంలోవెలువడే అవకా శం ఉంది. దీనివల్ల విద్యార్థులు అదే ఏడాది ఉన్నత విద్యకు (11వ తరగతి) ప్రవేశం పొందేందుకు ఎటువంటి ఆటంకం కలగదు.

# ఇంకెంతకాలం?.. పరసేవా పరాయణత్వం!



పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో చోటుచేసుకున్న పరిణామాలను నిశితంగా కాకపోయినా మోస్తరు పరిశీలించినా చిన్నప్పుడు బడిలో చదువుకున్న స్వయం పోషకాలకు, పరపోషకాలకు మధ్య ఉండే తేడా గుర్తుకొచ్చింది. ఆత్మగౌరవం, అస్తిత్వం, రాజకీయార్థకోణంలో చూసినప్పుడు ఈ తేడా మరింత స్పష్టమైంది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో జరిగిన చర్చ అనేకానేక ఆసక్తికరమైన అంశాలను మళీ ?లమళ్లీ తెరముందుకు తెచ్చేందుకు పార్లమెంట్ సభ్యులు, కేంద్రమంత్రులు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రాల ప్రజల ఆకాంక్షల ప్రతినిధులుగా ప్రతినిధులుగా వ్యవహరించిన తీరుకు ముచ్చటేసింది. అదే తెలంగాణ నుంచి లోక్‌సభలో ప్రతినిధులుగా ఉన్న మననాయకుల తీరును చూసినపుడు ఒళ్లంతా అగ్నిగోళమైంది. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంపై అక్కసు వెళ్లగక్కినప్పుడు..అధికార అహంకారంతో విర్రవీగుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని కించపరుస్తున్నప్పుడు ఒళ్లు రోమాంచితమైంది. ఆరు దశాబ్దాల అవిరామ ఆకాంక్షను లెక్కలేకుండా ఎగతాళి చేస్తున్నప్పుడు.. వందల మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలు, తెలంగాణ సమాజ వీరోచిత పోరాటాలను నెమరువేసుకుంటూ 13 ఏండ్లుగా స్వరాష్ట్రంలో భానూదయాన్ని స్వాగతిస్తున్న ఈ గడ్డపై పార్లమెంట్ సాక్షిగా 'సూర్య'గ్రహణం పట్టినందుకు మనుసు కలికలి అయింది. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం 'దేశ విభజనను చేసినట్టే... ఇండియా–పాకిస్థాన్‌ను విడగొట్టినట్టే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను విడగొట్టింది' అనే పోలికతో విషం చిమ్ముతున్నప్పుడు గురజాడ గిరీశం గుర్తుకొచ్చిండు. అవును. నిజం. గిరీశం పాత్రధారి 'మనవాళ్లు ఉత్త......!' అన్నట్టే అనిపించింది. తెలంగాణపై అంతలేసి మాటలు అంటున్నా సభలో ఉండి కూడా ఉత్సవ విగ్రహాల కన్నా హీనంగా ప్రాణంలేని బొమ్మలుగా పడిఉన్న తీరును చూస్తే జాలికలిగింది. అయితే, అన్నింట్లో అదే ఉత్సవ విగ్రహ పాత్ర పోషిస్తున్నారా? అంటే అలా పోషించటంలేదు. తెలంగాణ నుంచి గెలిచినవాళ్లకు సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువ అని తమ నాయకుడిని పల్లెత్తు మాటంటే ఊరుకునేది లేదు అన్నట్టు వ్యవహరించిన తీరుకు ఒళ్లంతా జ్వాలాతీతమైంది. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కటానికి కొద్ది నిమిషాల ముందే అదే బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తమిళులు 'భాషావేర్పాటువాదులు' అని వ్యాఖ్యానించారు. అంతే, సభ ఒక్కసారిగా వేడెక్కింది. డీఎంకే, కాంగ్రెస్, వీసీకే ఇలా పార్టీలకు అతీతంగా తమిళ ఎంపీలంతా లేచి అభ్యంతర పెట్టారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్ధాంతాలు, వైఖరులు ఏ పార్టీవి వారివే అయినా తాము తమిళగడ్డ బిడ్డలమని, తమ ప్రజల ఆకాంక్షలకు ఎవరు విఘాతం కలిగించినా సహించమని చెప్పిన తీరుకు సెల్యూట్ చెప్పాలని అనిపించింది. డీఎంకే ఎంపీలు రాజా, కనిమొళి, జమ్ము కశ్మీర్ ఎంపీ అల్తాఫ్ అహ్మద్ నియోజకవర్గాల పునర్విభజన కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను, వారి ఆత్మను ఎట్లా విచ్ఛిన్నం చేసిందీ కండ్లకు కట్టినప్పుడు, పంజాబ్ ఎంపీ ప్రొఫెసర్ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోల్‌కతా కాళీమాతగా ఎట్లా బెంగాల్‌ను కాపాడుతుంది? అని వివరిస్తూ తమతమ ప్రాంతాల ప్రతిష్టను పార్టీలకు అతీతంగా ఆకాశానికి ఎత్తిన వైనానికి, తెలంగాణ చెట్టు పేరు చెప్పుకొని గెలిచి ఆ చెట్టుకొమ్మనే కాదు ఆ చెట్టు వేర్లనే తెగనరికేందుకు సాహసిస్తుంటే మన పుణ్యాత్ములు చేవహీనమై, అచేతన జీవుల్లా పడి ఉన్నారేంది? అనే వేదన వెంటాడింది. తెలంగాణ ఆత్మ నిండినవాళ్లు, తెలంగాణ ఉద్యమంలో మమేకమైనవాళ్లు.. తెలంగాణ సాంస్కృతిక వారధులుగా ఉన్నవాళు సభలో లేకపోవటం తెలంగాణకు జరిగిన తీరని అన్యాయమే. అదే సమయంలో సభానాయకుడిపై విపక్ష సభ్యుడు ఒక్క మాటంటే మాత్రం ఉన్నపళంగా లేచి ఆక్షేపించటం, ఆగ్రహం వ్యక్తం చేయటమే కాదు ఏకంగా క్షమాపణ చెప్పాల్సిందేనని తెలంగాణ ఓట్లతో గెలిచిన కేంద్రమంత్రి పట్టుబట్టారు. అంటే ఆ నాయకుడికి నాయకుడే ప్రధానం కానీ, తెలంగాణ అప్రధానం. ఈ క్రమంలోనే తెలంగాణ ఆత్మగౌరవ, అస్తిత్వ అంశతోనే కాదు రాజకీయార్థిక కోణంలోనూ స్వయంపోషకులే కావాలి. అంతేకాదు పరపోషక.. పరకీర్తి పరులు ఎందరున్నా తెలంగాణకు అపకీర్తే.

## పోయిన ఫోన్లు తిరిగి అందజేసిన ముదిగొండ పోలీసులు




ముదిగొండ, : ముదిగొండ మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుండి పనుల నిమిత్తం వచ్చిన నలుగురు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా, ముదిగొండ పోలీసులు చురుకుగా స్పందించి వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ముదిగొండకు చెందిన శివరాత్రి రామయ్య, పిప్పలల కృష్ణ, నేలకొండ పల్లికి చెందిన రాజపుత్ర సాయి, ఆలకుంట నవీన్ తమ మొబైల్ ఫోన్లు కోల్పోయినట్లు ఇచ్చిన ఫిర్యాదులను పోలీసులు సీఐఇఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. అనంతరం సాంకేతిక సహాయంతో శోధన చేపట్టి ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.సుమారు రూ. 71,000 విలువైన నాలుగు మొబైల్ ఫోన్లను ముదిగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) మురళి గురువారం బాధితులకు అందజేశారు

# ఆలయాలకు రక్షణ కరువు...

హైదరాబాద్, : దేవాలయాల్లో దేవుడి సొమ్ముకు రక్షణ కరువవుతోంది. భక్తులు భక్తితో సమర్పించే కానుకలు, ఆభరణాల నిర్వహణలో కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో విలువైన సొత్తు మాయమవుతోంది. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయాల వరకు పలుచోట్ల అవకతవకలు వెలుగుచూశాయి. చిక్కడ పల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఒక భక్తుడు అందజేసిన 2.30 కిలోల వెండి కిరీటానికి సంబంధించి రశీదు ఇవ్వకపోవడం, దానిని రిపేరు పేరుతో బయటకు పంపి నాలుగేళ్లు దాటినా తిరిగి తీసుకురాక పోవడం చర్చనీయాంశమైంది. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు విచారణ జరిపి, ఈఓ కె.రామాంజనేయులుపై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బంగారు, వెండి వస్తువుల నిర్వహణలో లోపాలు, బయోమెట్రిక్ హాజరు పాటించకపోవడం వంటి కారణాలతో ఈఓ శేఖర్, సూపరిం టెండెంట్ హైమావతిలను అధికారులు సస్పెండ్ చేశారు.సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో అమ్మవారి ఆభరణాల లెక్కల్లో భారీ తేడాలున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 2006 నాటి లెక్కల ప్రకారం ఆలయంలో 5 కిలోల 473 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు ఆభరణాలు ఉండాలి. కానీ 2017లో నాటి ఈఓ స్వాధీనం చేసుకున్న సమయంలో కేవలం 2 కిలోల 132 గ్రాముల 94 మిల్లీగ్రాముల నగలకు సంబంధించిన వివరాలే ఉన్నట్లు సమాచారం. మిగిలినఆభరణాల ఆచూకీపై స్పష్టత లేదని ఆలయ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.చాలాచోట్ల భక్తులు సమర్పించే వెండి, బంగారు కానుకలకు ఆలయ అధికారులు రశీదులు ఇవ్వడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. దులపల్లికి చెందిన సుజాత అనే భక్తురాలు సంతోషీమాత ఆలయానికి వివిధ సందర్భాల్లో సమర్పించిన 1.25 కేజీల వెండి, 21 గ్రాముల నెక్లెస్, బంగారు ముక్కుపుడకలకు రశీదు అడిగితే అధికారులు దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆలయ ఆభరణాల రక్షణ కోసం దేవాదాయ శాఖ కొన్ని స్పష్టమైన నిబంధనలు విధించింది.భక్తులు సమర్పించే బంగారానికి తూకం వేసిన రశీదు, ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఇవ్వాలి.ప్రతి వస్తువును ఫోటో తీసి, దాని వివరాలను ఈఓ, ఛైర్మన్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలకు పంపాలి.నిత్యం అలంకరించే నగలు అర్చకుల ఆధీనంలో ఉండాలి, మిగిలినవి బ్యాంకు లాకర్లలో భద్రపరచాలి

# ఫ్యాన్ కిందకు ఆమంచి



ఒంగోలు, : వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో గెలవాల్సిన ఎన్నికలు అవి. లేకుంటే పార్టీకి గడ్డు పరిస్థితులు తప్పవు. అందుకే సర్వశక్తులు ఒడ్డుతోంది ఆ పార్టీ. గెలుపు గుర్రాలను వెతికే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. గెలిచే ఛాన్స్ ఉన్నవారికి టికెట్లు ఇవ్వాలని భావిస్తున్నారు. అందుకే వివిధ కారణాలతో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వారికి తిరిగి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ నేతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ప్రకాశం జిల్లా రాజకీయాలు ఒక మలుపు తిరిగినట్టే. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కు వైసీపీలోకి వచ్చేందుకు అనుమతి లభించినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఆయన చీరాల నియోజకవర్గంలో పర్యటనలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.ప్రకాశం జిల్లా రాజకీయాల్లో ఆమంచి కృష్ణమోహన్ ది ప్రత్యేక స్థానం. ఒక సాధారణ జడ్పిటిసిగా ఉన్న ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మరోసారి ఇండిపెండెంట్గా పోటీ చేసి ప్రధాన పార్టీ అభ్యర్థులకు ఓడించి మరి ఎమ్మెల్యే అయ్యారు. ప్రధానంగా చీరాల నియోజకవర్గంలో ఆమంచి కృష్ణమోహన్ కు పట్టు ఎక్కువ. బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన జడ్పిటిసిగా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. రోశయ్య ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణించగలిగారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలోకి.. వైసీపీ నుంచి టీడీపీలోకి.. అక్కడ నుంచి కాంగ్రెస్లో చేరారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. షర్మిల పక్కన కనిపించే ఆమంచి కృష్ణమోహన్ ఇటీవల కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరమయ్యారు. తన అనుచరులతో తరచూ చేరాలని నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు.ప్రస్తుతం చీరాల నియోజకవర్గ ఇన్చార్జిగా కరణం బలరాం కుమారుడు వెంకటేష్ ఉన్నారు. అయితే వారు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో తనకంటూ పట్టు నిలుపుకుంటూ వచ్చారు ఆమంచి కృష్ణమోహన్. 2009లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచిన ఆయన తెలుగుదేశం పార్టీ అనుబంధ సభ్యుడిగా కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే చంద్రబాబు అనూహ్యంగా కరణం బలరామును చీరాల అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభంజనం వీచింది. చీరాలలో మాత్రం టిడిపి అభ్యర్థి కరణం బలరాం గెలిచారు. గెలిచిన కొద్ది రోజులకే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అప్పటినుంచి కరణం బలరాం వర్సెస్ ఆమంచి కృష్ణమోహన్ అన్నట్టు పరిస్థితి మారింది. ఈ క్రమంలో ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కరణం బలరాం చూపు మాత్ర పార్టీ వైపు ఉందన్న ప్రచారం ఉంది. అదే జరిగితే చీరాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తప్పేలా లేదు. అందుకే అక్కడ పట్టున్న ఆమంచి కృష్ణమోహన్ ను పార్టీలోకి రప్పించి టికెట్ ఇవ్వాలన్న ఆలోచనలో జగన్ ఉన్నారు. అందుకే పార్టీకి దూరంగా ఉంటున్నారు ఆమంచి. త్వరలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్న ప్రచారం సాగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# కమలంలో జోష్...



విజయవాడ, : జనసేన పార్టీని అన్ని రకాలుగా బలోపేతం చేయాలనే యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఇప్పటికే చాలా వరకు పార్టీ కమిటీల ఏర్పాటును పూర్తి చేసిన జనసేన చీఫ్, సభ్యత్వ నమోదును స్పీడప్ చేశారు. 20 లక్షల సభ్యత్వాలు టార్గెట్‌గా సుదీర్ఘంగా డ్రైవ్ చేస్తున్నారు. ఇదే కాకుండా పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించేందుకు లీడర్లను సిద్ధం చేశారు. ఇందుకోసం ఎంపిక చేసిన అధికార ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల జనసేన పార్టీపైనా, పవన్ కల్యాణ్ పైనా వస్తున్న కొన్ని విమర్శలను తిప్పికొట్టడంలో స్పోక్స్ పర్సన్స్ పూర్తి స్థాయిలో సక్సెస్ కావట్లేదన్న భావనతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరు నేతలు పార్టీ వేదికలపై, టీవీ డిబేట్లు, ప్రెస్‌మీట్లలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి..తలనొప్పులు తెచ్చి పెడుతుండటంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికార ప్రతినిధులు పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించాలని..అలా అని లైన్ దాటి మాట్లాడొద్దని డైరెక్షన్స్ ఇచ్చారు పవన్.పార్టీ అధికార ప్రతినిధులకు రెండు రోజుల పాటు ట్రైనింగ్ వర్క్‌షాప్ నిర్వహించింది జనసేన. పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికార ప్రతినిధులకు వివిధ అంశాలపై ఈ శిక్షణ తరగతులు పెట్టారు. ముఖ్యంగా మీడియా చర్చల్లో బాధ్యతాయుతంగా, సమర్థంగా పాల్గొనే నైపుణ్యాలను ఈ రెండు రోజుల వారికి శిక్షణ ఇచ్చారు. ఇకపై రెగ్యులర్‌గా వీరంతా పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించనున్నారు. ఇటీవలే పార్టీ కార్యవర్గ సమావేశంలో పవన్ కల్యాణ్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాను ఒక్కడినే మాట్లాడాలా? మీరంతా ఉండి ఎందుకు అని ప్రశ్నించడంతో కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే యాక్టివ్ అయ్యారు. అవసరం అయ్యినప్పుడల్లా మాట్లాడుతున్నారు. అయితే చర్చా వేదికల్లోనూ పార్టీ వాయిస్‌ను వినిపించేలా అధికార ప్రతినిధులకు హితబోధ చేశారు.మాట పదునుగా ఉండాలి. బూతులు మాట్లాడొద్దు. మహిళల జోలికి అసలే వెళ్లొద్దు. వ్యక్తిగత అంశాల ముచ్చటే వద్దు. సబ్జెక్ట్ బేస్డ్‌గా కౌంటర్ ఉండాలి. పిన్ టు పిన్ ఇచ్చి పడేయాలంతే అంటూ స్పోక్స్ పర్సన్స్‌కు జనసేన శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇచ్చారు. అనవసర విషయాలను ప్రస్తావించి ఇరకాటంలో పడొద్దని..లైన్ దాటి మాట్లాడితే ప్రజల్లో చులకన అవుతామన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.అలాగని విపక్షం ఏ విమర్శ చేసినా తమకేం పట్టనట్లు ఉంటే కుదరదని తేల్చి చెప్పారు.అధికార ప్రతినిధులు అంటే పార్టీ తరఫున, అధినేత తరఫున గళం వినిపించే బాధ్యత మీపై ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దని గుర్తు చేశారు. ఇలా జనసేన అధికార ప్రతినిధులకు వివిధ అంశాలపై డైరెక్షన్స్ ఇచ్చారు. మీడియా చర్చల్లో బాధ్యతాయుతంగా, సమర్థంగా పాల్గొనేలా స్కిల్స్ పెంచుకోవాలని..పార్టీ భావజాలాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పుకొచ్చారు. ఇలా అధికార ప్రతినిధులకు శిక్షణ ఇచ్చి మరీ జోష్ పెంచడం వెనుక సేనాని వ్యూహం ఏంటన్నది ఆసక్తికరంగా మారింది.

# ఇంధన భద్రతపై భారత్ దృష్టి

## గ్రీన్ ఉనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు

న్యూఢిల్లీ, : ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. రిఫైనరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

## తొలిదశ ఎన్నికల వేళ

### పోలింగ్ కేంద్రం వద్ద నాటు బాంబుతో దాడి

కోల్‌కతా,ఏప్రిల్23 : తొలిదశ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పోలింగ్ వేళ తాజాగా నాటు బాంబుతో దాడి జరగడం కలకలానికి దారి తీసింది. జిల్లాలోని నవోదా ప్రాంతం లోగలఒక పోలింగ్ బూత్‌సమీపంలో ఈ ఘటనజరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఒకరు పోలింగ్ బూత్ సమీపంలో బాంబు విసరడంతో పలువురు గాయాలపాలయ్యారు. దీంతో, తీవ్ర భయాందోళనలకు లోనైన ఇతర ఓటర్లు పరుగులు తీశారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఘటన సమాచారం అందగానే ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు తనిఖీలు చేపట్టాయి. బాంబు విసిరినది ఎవరో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలింగ్‌కు అడ్డంకి సృష్టించేందుకు ఈ దాడి జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం తొలి దశలో భాగంగా 152 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. 16 జిల్లాలోని స్థానాలకు జరుగుతున్న అసెంబ్లీ ఈ ఎన్నికల్లో మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వచ్చే వారం మిగిలిన 142 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.

## అర్ధరాత్రి కానిస్టేబుల్ వీరంగం.. రెస్టారెంట్ సిబ్బందిపై దాడి..

హైదరాబాద్: విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఓ రెస్టారెంట్ సిబ్బందిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని టోలిచౌకిలో వెలుగుచూసింది. అర్ధరాత్రి విధులు నిర్వరిస్తున్న జ్ఞానేశ్వర్ అనే కానిస్టేబుల్ టోలిచౌకిలో ఉన్న అల్ రికాబ్ మండి రెస్టారెంట్‌ను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచినందుకు అందులో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేశాడు. ఓ వ్యక్తిని కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్ లాఠీతో దారుణంగా చితకబాదిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. టోలిచౌకి పోలీసుల వివరాల ప్రకారం ఈ దాడి ఘటన ఏప్రిల్ 21న జరిగింది. హోటల్ నిర్దేశించిన సమయాని కంటే ఎక్కువ సేపు తెరిచి ఉంచడంపై సిబ్బందిని కానిస్టేబుల్ ప్రశ్నించాడు.. దీంతో ఆ వ్యక్తి కానిస్టేబుల్‌ను దూషించాడు.. అందువల్ల కానిస్టేబుల్ సదరు వ్యక్తిని కొట్టాడు, దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌ను మరో ప్రాంతానికి బదిలీ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

## మృతిరాలు బాలవ్వ ...బంగారు కమ్మలు మాయం...!



జగిత్యాల : జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంచలన ఘటన వెలుగుచూసింది. మృతదేహం నుంచి బంగారు కమ్మలు మాయమవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన బాలవ్వ అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూనే ఆమె మృతి చెందింది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే, ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తుండగా, బాలవ్వ చెవులకు ఉన్న బంగారు కమ్మలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఆసుపత్రిలోనే అవి మాయం అయ్యాయని అనుమానం వ్యక్తం చేస్తూ సిబ్బందిపై ఆరోపణలు గుప్పించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు స్వీకరించారు. మృతదేహం నుంచి ఆభరణాలు మాయం కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. నిజానిజాలు తేలాల్సి ఉంది.

# సింగర్ 200 కోట్ల కథ ఏంటీ



హైదరాబాద్, : సింగర్ మంగ్లీ, రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని పేరు. తన పాటలతో.. పాటంటే మంగ్లీ, మంగ్లీ అంటే పాట అన్నట్లుగా ఎదిగారు. ఊరువాడ తన గొంతుతో ఉర్రూతలూగించిన ఈ జానపద కోకిల, ఇప్పుడు 'నోట్ల' డప్పు కొడుతోందా? స్టేజ్ మీద స్టెప్పులేసే మంగ్లీ, ఇప్పుడు పోలీస్ స్టేషన్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అసలు ఈ 200 కోట్ల కథ ఏంటి? ఎవరిని నమ్మించి ముంచేశారు.? ఈ స్కామ్‌లో నిజంగానే మంగ్లీ పాత్ర ఉందా.?ఒకప్పుడు మంగ్లీ గొంతు వింటే పల్లె పులకరించేది.. కానీ ఇప్పుడు మంగ్లీ పేరు వింటే వివాదాలు పలకరిస్తున్నాయి. తాజాగా 200 కోట్ల స్కామ్ ఆరోపణలు ఆమె చుట్టూ ముసురుకున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే మంగ్లీ టైమ్ అస్సలు బాలేదు.! మొన్న తిరుమలలో ప్రొటోకాల్ వివాదం.. అంతకుముందు బోనాల పాటలో పదాల గొడవ.. ఆ తర్వాత కాళహస్తిలో డ్యాన్స్ ఇష్యూ. ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఆమెను వెంటాడుతూనే ఉన్నాయి. అయితే ఇవన్నీ ఒకెత్తు.. ఇప్పుడు వచ్చిన '200 కోట్ల స్కామ్ మరో ఎత్తు. ఇది కేవలం పాటల గొడవ కాదు.. సామాన్యుల జేబులకు పడ్డ కన్నాల గురించి! మంగ్లీ మాట నమ్మి పైసలు పోగొట్టుకున్న బాధితులు, ఇప్పుడు ఆమెపై నిప్పులు చెరుగుతున్నారు. గోకుల నందనన్నా అనే కంపెనీలో మంగ్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. అయితే స్కామ్ జరిగింది కూడా ఇదే కంపెనీ పేరుతో కావడంతో మంగ్లీ కూడా ఈ స్కామ్‌లో ఉన్నారనే ఆరోపణలకు మరింత బలం చేకురింది. కంపెనీలో.. మంగ్లీ కేవలం బ్రాండ్ అంబాసిడర్ మాత్రమేనా? లేక వెనకుండి నడిపించిన డైరెక్టరా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పోలీసులు 10 కోట్లు అంటే.. బాధితులు 200 కోట్లు అంటున్నారు. అంటే ఇక్కడ లెక్కల్లో భారీ మొత్తంలో తేడా కొడుతోంది! మంగ్లీ ఏమో నాకేం తెలీదు.. నేను అమాయకురాలిని అని నార్సింగిలో ఫిర్యాదు చేశారు. పంజాగుట్టలో ఆమెపై కేసు నమోదైతే.. ఆమె వెళ్లి నార్సింగిలో కంప్లైంట్ ఇవ్వడం చూస్తుంటే.. సీన్ చాలా రివర్స్‌లో ఉన్నట్టు కనిపిస్తోంది. తర్వాత మళ్లీ పంజాగుట్టలో కూడా ఫిర్యాదు చేశారనుకోండి అది వేరే విషయం. విషయానికి వస్తే.. అడ్వకేట్ సుబ్బారావు అనే వ్యక్తి మంగ్లీ ఆమె తమ్ముడు శివ, తన స్నేహితులు మధు, భరత్ చౌహాన్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోకుల నందనన్నా సంస్థలో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు 150 మందికిపైగా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వద్దకు వచ్చి బాధితులు మొరపెట్టున్నారని సుబ్బారావు తెలిపారు. ఈ స్కామ్ విలువ సుమారు 200 కోట్ల రూపాయల వరకు ఉండొచ్చని ఫిర్యాదులో చెప్పారు. వాటీతో పాటు భరత్ చౌహన్ డబ్బు కట్టలను లెక్కిస్తున్న వీడియోను కూడా ఆయన రిలీజ్ చేశారు. దీంతో విషయం మరింత రాజుకుంది. ఈ టీమ్ వసూళ్లకి పాల్పడితే మంగ్లీ ప్రమోషన్ చేశారంటూ బాధితులతో కలిసి పోలీసులకు కంప్లయింట్ ఇచ్చారు. మరోవైపు 'మాకు కంపెనీ గురించి తెలియకపోయినా, మంగ్లీని చూసి, ఆమె మాటలు నమ్మి మా కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టాము. ఇప్పుడు కంపెనీ బోర్డు తిప్పేస్తే, ఆమెకు సంబంధం లేదనడం సరికాదు" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతన్నారు. ఈ విషయంపై కాస్త లేటయినా ఘాటుగా రియాక్ట్ అయ్యారు మంగ్లీ. మనీ మ్యాటర్.. లాయర్ ఆరోపణలు.. ఈ రెండింటిని తిప్పికొట్టారు. తన వ్యక్తిత్వానికి భంగం కలిగేలా.. అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కోట్ల రూపాయల స్కామ్ అంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారామె. సోషల్ మీడియాతో ఎదిగిన తనను.. అదే సోషల్ మీడియా అప్రతిష్టపాలు చేస్తుందని ఊహించలేదని మంగ్లీ కన్నీరు పెట్టున్నారు. కాస్త ఎమోషనల్ అవుతూనే ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌తో సంబంధం లేదని మంగ్లీ కుండబద్దలు కొట్టారు. అడ్వకేట్ సుబ్బారావు సెలేబ్రిటిగా మారాలి అని టార్గెట్ పెట్టుకున్నారు. ఫేమస్ అవ్వడమే తన లక్ష్యమని మంగ్లీ ఆరోపించారు. శ్రీముఖి అంటే క్రష్ అని చెప్పాడని మంగ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా ద్వారా ఫేమస్ అయి బిగ్‌బాస్ లోకి వెళ్ళాలి సుబ్బారావు అనుకుంటున్నాడని అన్నారు. అందుకే నన్ను ఇలా ఇరికించాలని ప్రయత్నిస్తున్నాడు అంటూ మంగ్లీ ఎమోషనల్ అయ్యింది. మంగ్లీ చెప్పింది నిజమైతే.. మరి స్కీమ్ పేరుతో జరిగిన స్కామ్‌లో ఉన్నదెవరు? పైసా వసూల్ డైరెక్షన్ ఎవరిది? వీడియోలో కన్పిస్తోన్న డబ్బంతా ఎవరి చేతుల్లోకి వెళ్లిపోయింది? మంగ్లీ ఆరోపిస్తున్నట్టు ఫేమ్ అయ్యేందుకే అడ్వకేట్ సుబ్బారావు ఇంత హంగామా చేస్తున్నారా అన్నది పోలీసుల విచారణలోనే తేలాలి. ఏది ఏమైనా మంగ్లీ వ్యవహారం ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్ మారింది.

## ఆర్టీసీ సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు

**కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



కరీంనగర్: ఆర్టీసీ కార్మికులు తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. గురువారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన, కార్మికులను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యంపై ఆయన తీవ్రంగా విమర్శలు గుప్పించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం బేషరతుగా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులకు టెంట్ వేసుకునే అనుమతి కూడా ఇవ్వకపోవడం యాజమాన్యం మొండితనం, నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంత వరకు బీజేపీతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కార్మికుల పక్షాన నిలుస్తారని భరోసా ఇచ్చారు. సమ్మె శిబిరంలో కార్మికులు తమ సమస్యలను సునీల్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మహిళా కార్మికులు పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిందని, కుటుంబ కార్యక్రమాలకు కూడా హాజరుకాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని, ఇప్పటికైనా మొండివైఖరి వీడి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సునీల్ రావు కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్టీసీ కార్మికులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ల వ్యవస్థ ముగింపేనా..!





విశాఖపట్టణం, : వాలంటీర్ వ్యవస్థ.. వైసీపీ హయాంలో పెన్షన్ల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు వైసీపీ ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ వ్యవస్థ. ఈ వాలంటీర్ సిస్టమ్‌ను వైసీపీ దుర్వినియోగం చేసిందన్నదానిపైనే ఏపీ ఎన్నికల వేళ పెద్దఎత్తున చర్చ జరిగింది. వాలంటీర్ల సెంట్రిక్‌గానే ఎలక్షన్ ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలో కూటమి వాలంటీర్లపై అప్పట్లోనే సీరియస్ కామెంట్స్ చేసింది. ఇక పవర్‌లోకి వచ్చాక వాలంటీర్ల ముచ్చటే తీయకుండా సున్నితంగా ఆ సిస్టమ్‌కు చెక్ పెట్టగలిగింది. వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని అప్పట్లో సర్పంచ్‌లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరగా క్లియర్ కట్ క్లారిటీ ఇచ్చేశారాయన. అసలు వాళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చుని, కానీ అసలు వ్యవస్థలోనే లేరని చెప్పేశారు. దీంతో కూటమి సర్కార్ వాలంటీర్ వ్యవస్థకు మంగళం పాడినట్లేనని విమర్శిచింది వైసీపీ. తాము లక్షల మంది వాలంటీర్లను పెట్టి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేస్తే కూటమి సర్కార్ ప్రజలను ఇబ్బంది పెడుతోందని అటాక్ చేసింది. అయితే ఇప్పుడు వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థపై యూటర్న్ తీసుకుంది. అప్పుడు జరిగిన డ్యామేజ్‌ను కవర్ చేసుకునేందుకు క్యాడర్ మనసు గెలుచుకునేందుకు సరికొత్త స్టేట్‌మెంట్స్‌తో ఇండికేషన్స్ పంపిస్తోంది. గత ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమికి వాలంటీర్ వ్యవస్థే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ మధ్య కామెంట్స్ చేశారు. పాలనలో ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎటువంటి ప్రాధాన్యం లేకపోవడంతో ప్రజలకు దూరమై, ఓడిపోయామన్నారు. వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు జరిగి, వైసీపీకి నష్టం జరిగిందన్నారు గుడివాడ. ఈ సమస్యను అధినేత జగన్ కూడా గుర్తించారని, మరోసారి ఇటువంటి పొరపాటు జరక్కుండా చూసుకుంటారని చెప్పారు. 2029 ఎన్నికల తర్వాత మళ్లీ వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చే ప్రసక్తే ఉండదని, అధినేత జగన్ కూడా ఈ విషయమై స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి తేల్చిచెప్పారు. ఏపీలో 2019 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను పెట్టి వారి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు దగ్గరయ్యేలా చేసింది. దీంతో ప్రజలకు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు మధ్య దూరం పెరిగిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. వాలంటీర్లకు ప్రాధాన్యం ఇవ్వడంపై వైసీపీ క్యాడర్ హర్ట్ అయిందని పార్టీకి, కార్యకర్తల మధ్య ఎమోషనల్ గ్యాప్ వచ్చిందన్న టాక్ ఉండేది. అందుకే 2019 ఎన్నికలకు ముందు కష్టపడి పనిచేసిన కార్యకర్తలు 2024కు వచ్చేసరికి డీలా పడిపోయారని అంటుంటారు. ఇప్పటివరకు ప్రచారంలో ఉన్న ఈ వాస్తవాలను ఇప్పుడు వైసీపీ కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. దీంతో వాలంటీర్ వ్యవస్థను తెచ్చి మళ్లీ పాత తప్పు చేయకూడదని వైసీపీ డిసైడ్ చేసుకున్నట్లు చెబుతున్నారు. గుడివాడ అమర్‌నాథ్ కామెంట్స్‌ను బట్టి చూస్తే..ఏపీలో వాలంటీర్ వ్యవస్థ పూర్తిగా ముగిసిన అధ్యాయమేనన్న క్లారిటీ వచ్చేసింది. తెరమరుగైన వాలంటీర్ల వ్యవస్థను తిరిగి కొనసాగించే అవసరం, అవకాశమే లేదని వైసీపీ నేతలు కూడా డిసైడ్ కావడంతో వాలంటీర్ వ్యవస్థ చరిత్రగానే మిగిలిపోనుంది. వైసీపీ ఇచ్చిన క్లారిటీతో కూటమికి పాజిటివ్‌గా మారే ఛాన్స్ ఉందంటున్నారు. మళ్లీ పవర్‌లోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను తెస్తామని వైసీపీ చెప్తే గనుక అదీ మళ్లీ ఎలక్షన్ ఎజెండాగా మారే అవకాశం ఉంటుంది. వాలంటీర్లు లక్ష మంది వరకు ఉంటారు. పైగా వాలంటీర్ వ్యవస్థ ఉన్నప్పుడు ప్రజలకు నేరుగా సేవలు అందాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ వాలంటీర్ వ్యవస్థను తీసుకొస్తామని వైసీపీ చెప్పినా..వాలంటీర్లకు ఎన్నికల ముందు కూటమి ఇచ్చినా హామీలను గుర్తు చేసినా..పొలిటికల్ ఫైట్‌కు దారితీసేది. కానీ వైసీపీనే వాలంటీర్ వ్యవస్థకు మంగళం అని చెప్పేదయం పొలిటికల్ ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది.

## మట్టి'మనుషులకు చట్టసభల్లో చోటేది?



తెలంగాణ జనాభాలో కుమ్మరి/శాలివాహన సామాజికవర్గం వాటా 1.2 శాతం ఉన్నందున దామాషా పద్ధతి ప్రకారం.. కనీసం 1 నుంచి 2 ఎమ్మెల్యే సీట్లు ఆ వర్గానికి దకాలి. 17 ఎంపీ సీట్లు ఉన్నందున ఐదు లోక్‌సభ ఎన్నికలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో ఒక స్థానం ఉండాలి. చట్టసభల్లో నేరుగా ఎన్నికయ్యే అవకాశం లేనప్పుడు నామినేటెడ్ కోటాలో శాసనమండలిలో కనీసం ఒక సీటు అయినా కేటాయించి వారి రాజకీయ శూన్యత్వాన్ని భర్తీ చేయాలి. కానీ, రాష్ట్రంలో 4,31,363 (1.2 శాతం) జనాభా ఉన్న కుమ్మరి సామాజికవర్గానికి చట్టసభల్లో ఒక సీటు కూడా దకకటం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల నుంచి ఇప్పటికీ కుమ్మరి సామాజికవర్గం ఒక నిశ్శబ్ద ఓటుబ్యాంకుగానే మిగిలిపోయింది. ఉమ్మడి ఏపీలో 294 అసెంబ్లీ స్థానాలు ఉన్నప్పటికీ, కుమ్మరి కులస్తులకు ఎమ్మెల్యే టికెట్లు దక్కలేదు. జనాభాపరంగా బీసీ-బీ క్యాటగిరీలో ఉన్న వీరు, రాజకీయంగా బలంగా ఉన్న ఇతర బీసీ కులాల నీడలోనే ఉండిపోయారు. కాంగ్రెస్ లేదా టీడీపీ వంటి ప్రధాన పార్టీలు వీరిని కేవలం స్థానిక సంస్థల స్థాయికే పరిమితం చేశాయి. నామినేటెడ్ పదవుల్లో కూడా వీరికి దకిన వాటా నామమాత్రమే. కుమ్మరి సామాజికవర్గానికి చెందిన బలమైన నేత ఐలాపురం వెంకయ్య శాసనమండలి సభ్యునిగా ఎనిమిదేండ్లపాటు పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా తాడూరి శ్రీనివాస్‌కు కేసీఆర్ అవకాశం కల్పించారు. కుమ్మరి కులానికి ఆత్మగౌరవ భవనం కేటాయించారు. రాష్ట్రమంతటా కుమ్మరి జనాభా విస్తరించి ఉన్నది. కానీ, ఏ ఒక నియోజకవర్గంలోనూ గెలుపోటములను శాసించే స్థాయిలో లేదు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 94 మంది కుమ్మరి కులస్తులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా గెలిచి సత్తాచాటారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సీపెక్ డాటా గణాంకాలను పరిశీలిస్తే, సామాజికంగా, ఆర్థికంగా కుమ్మరులు నిలకడగా ఉన్నప్పటికీ రాజకీయంగా ఈ కులం తీవ్ర వివక్షకు గురవుతున్నట్టు కనిపిస్తున్నది. రాష్ట్రం మొత్తం జనాభాలో కుమ్మరుల వాటా 1.2 శాతం. వీరి ఆర్థిక స్థితిగతులు మెరుగ్గానే ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం భూమిలో 1.4 శాతం భూమి వీరి హస్తగతమై ఉన్నది. జనాభా నిష్పత్తి కంటే ఎకువ భూమిని కలిగి ఉండి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తమదైన ముద్ర వేస్తున్నప్పటికీ, రాజకీయంగా మాత్రం వీరి గొంతు చట్టసభలకు చేరడం లేదు. కేవలం ఓటుబ్యాంకుగానే కాకుండా, చట్టసభల్లో నిర్ణయాత్మక శక్తులుగా కుమ్మరులను గుర్తించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

# వైసీపీ కిం కర్తవ్యం



విజయవాడ, : ప్రస్తుతం దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ మీద రాజకీయ చర్చ సాగుతోంది. అధికార ఎన్డీయే తీసుకున్న విధానం పట్ల ఇండియా కూటమిలో తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు అయితే తమ సీట్లు పెద్ద ఎత్తున తగ్గి రాజకీయంగా అభివృద్ధి పరంగా ఇబ్బంది అవుతుందని కూడా ఆందోళన చెందుతున్నాయి. దక్షిణాదిలోనే ఎక్కువగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. అయితే ఇందులో ఇండియా కూటమిలో ఉన్న డీఎంకే లాంటివి పూర్తిగా యాంటీ స్టాండ్ తీసుకుంటే అన్నా డీఎంకే జేడీఎస్, టీడీపీ జనసేన వంటివి జై కొడుతున్నాయి. అయితే చిత్రంగా తటస్థంగా ఉన్న వైసీపీ మాత్రం డీలిమిటేషన్ మీద కేంద్రం అనుసరిస్తున్న విధానానికి అనుకూలంగా స్పందిస్తోంది. అదే సమయంలో తెలంగాణాలో ఉన్న మరో ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ అయితే బిల్లు స్వరూప స్వభావాలను చూసి మాత్రమే ఏ సంగతీ చెబుతామని అంటోంది: దేశంలో కొత్తగా సీట్లు పెరిగితే మంచిదే కదా ఎంత మంది యువతకు కొత్త వారికి అవకాశాలు వస్తాయని వైసీపీ అంటోంది. అంతే కాదు చిన్న నియోజకవర్గాల వల్ల అభివృద్ధి కూడా సాగుతుందని చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం అసెంబ్లీ పార్లమెంట్ సీట్ల పునర్ విభజన చేసే విధానం పట్ల సంతృప్తిగా ఉన్నామని ఆ పార్టీ నేత సజ్జల రామక్రిష్ణారెడ్డి ప్రకటించడం విశేషం. నిజం చెప్పాలీ అంటే ప్రాంతీయ పార్టీల పట్టుని దెబ్బ తీసే విధంగా డీలిమిటేషన్ ప్రక్రియ ఉండబోతోంది అని అంతా అంటున్న నేపథ్యం ఉంది. స్టాలిన్ విజయ్ వంటి ప్రాంతీయ పార్టీల నేతలు వ్యతిరేకిస్తూ వైసీపీ ఓకే చెప్పడమే అసలైన ట్విస్ట్ ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అయితే డీలిమిటేషన్ మీద ఆచీ తూచీ స్పందించారు. కేంద్రం ప్రవేశపెడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము మద్దతు ఇస్తున్నట్లుగా ప్రకటించిన బీఆర్ఎస్ డీలిమిటేషన్ విషయంలో మాత్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించడం విశేషం. డీలిమిటేషన్ బిల్లులో పేర్కొన్న అంశాలు అన్నీ చూసిన మీదటనే పార్టీ ఒక నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ చెప్పడం విశేషం. సహేతుకంగా డిమాండ్ఇదిలా ఉంటే ప్రస్తుతం 543 ఎంపీలు దేశంలో ఉంటే సౌత్ స్టేట్స్ నుంచి 24 శాతం మంది ఎంపీల ప్రాతినిధ్యం ఉంది. ఆ శాతం తగ్గకుండా 50 శాతం సీట్లు పెంచాలని బీఆర్ఎస్ కోరుతోంది. అది కూడా 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని బీఆర్ ఎస్ అంటోంది. మొత్తం మీద డీలిమిటేషన్ విషయంలో బీఆర్ ఎస్ నిర్మాణాత్మకంగానే వ్యవహరించాలని చూస్తోంది. అలాగే ప్రాంతీయ పరమైన అవసరాలను పరిగణనలోకి తీసుకుంటోంది. వైసీపీ మాత్రం ఎన్డీయేకు ఔట్ రేట్ గా మద్దతు ఇవ్వడమే చర్చనీయాంశంగా ఉంది.

# డిప్యుటేషన్ల ప్రభావం..
# విద్యా లక్ష్యాలకు విఘాతం..

## ఉన్న చోటుకే పోస్టింగులు
## బోధన లేక విద్యార్థుల అవస్థలు..!



తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరోసారి ప్రజా చర్చకు దారితీస్తోంది. చేరికల పెంపు, డ్రాప్‌ఔట్ తగ్గింపు వంటి లక్ష్యాలతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఒకవైపు ఆశలు రేకెత్తిస్తుంటే, మరోవైపు పాఠశాలల్లో పెరుగుతున్న టీచర్ల కొరత, అసమాన కేటాయింపులు, డిప్యూటేషన్ దుర్వినియోగం వంటి సమస్యలు ఆ లక్ష్యాలనే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. విద్యార్థిని పాఠశాల గడప దాటించడం ఒక అడుగు మాత్రమే..అతనికి నాణ్యమైన బోధన అందేలా చేయడం అసలు బాధ్యత. ఈ విరుద్ధ దృశ్యం, విద్యా విధానాల రూపకల్పనకంటే వాటి సమర్థవంతమైన అమలే కీలకమని మరోసారి స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, పాఠశాల విద్యా వ్యవస్థలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. రాష్ట్రంలో సుమారు 13 వందలకు పైగా పాఠశాలల్లో ఒక్క టీచర్ కూడా లేకపోవడం సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. మరోవైపు 6 వేల 3వందలకు పైగా పాఠశాలలు ఒక్క టీచర్‌తోనే నడుస్తుండటం, దాదాపు 8 వేల 8 వందల పాఠశాలలు కేవలం ఇద్దరు టీచర్లతో కొనసాగుతుండటం పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో చూపిస్తోంది. కనీసం 3 వేల పాఠశాలల్లో స్పష్టమైన టీచర్ల కొరత ఉండగా, సుమారు 4 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే, 10 వేలకు పైగా పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ గణాంకాలే ప్రభుత్వ హామీలకు, వాస్తవానికి మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల కారణంగా దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు విద్యాపరంగా నష్టపోతున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కూడా పెద్ద సంఖ్యలో టీచర్లు డిప్యూటేషన్‌పై ఉండటం మరింత ఆందోళనకరం. 2023 నుంచి ఇప్పటివరకు సుమారు 15 వందల నుంచి 4 వేల మంది టీచర్లు డిప్యూటేషన్‌పై ఉన్నారని అంచనా. ఒకవైపు టీచర్లు లేని పాఠశాలలు ఉండగా, మరోవైపు అవసరం లేని చోట్లకు టీచర్లను డిప్యూటేషన్‌పై పంపించడం స్పష్టమైన పరిపాలనా లోపమేనని చెప్పాల్సి వస్తోంది.

సమస్య కేవలం టీచర్ల కొరతలో మాత్రమే లేదు; వారిని సరైన విధంగా కేటాయించకపోవడమే అసలు మూల కారణం. కొన్ని పాఠశాలల్లో టీచర్లు అవసరానికి మించి ఉండగా, మరికొన్ని పాఠశాలలు కనీస సిబ్బంది లేక నడవడం విచారకరం. ఒకచోట అధికం, మరోచోట కొరత.. ఈ అసమాన పరిస్థితి విద్యా వ్యవస్థలో సమతుల్యత లేకపోవడాన్ని బలంగా నిరూపిస్తోంది. దీనిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. అయితే డిప్యూటేషన్ అనే తాత్కాలిక మార్గాన్ని అధికంగా ఉపయోగించడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకుండా, మరింత జఠిలం చేస్తోంది. డిప్యూటేషన్ వ్యవస్థపై వస్తున్న విమర్శలు కూడా తక్కువేమీ లేవు. ఉన్నతాధికారులతో పరిచయాలు, రాజకీయ పలుకుబడి ఆధారంగా కొంతమంది టీచర్లు తమకు అనుకూలమైన పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత సౌకర్యాలు, పిల్లల విద్య, సులభమైన జీవనశైలి కోసం డిప్యూటేషన్‌ను వినియోగించడం సాధారణ ధోరణిగా మారింది. ఈ ప్రక్రియలో నిజాయితీ, పారదర్శకత లేకపోవడం, సందేహాస్పదంగా మారడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. ముడుపుల ఆరోపణలు వినిపించడం ఈ వ్యవస్థపై నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తోంది. డిప్యూటేషన్ వల్ల అసలు నష్టం విద్యార్థులకే జరుగుతోంది. ఒక పాఠశాల నుంచి టీచర్‌ను పంపిస్తే తరలిస్తే, అక్కడి పిల్లలు చదువులో వెనుకబడిపోవడం జరుగుతోంది. మరోవైపు ఇప్పటికే టీచర్లు సరిపడా ఉన్న పాఠశాలలకు అదనంగా పంపించడం వల్ల, ఆ సిబ్బంది పూర్తిస్థాయిలో వినియోగం కాకుండా ఉండిపోతున్నారు. అంటే ఒకచోట తీవ్ర కొరత, మరోచోట వృథా..ఇది లోప భూయిష్టమైన పరిపాలనకు నిదర్శనం. మానవ వనరులు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించకపోవడం విద్యా వ్యవస్థకు పెద్ద లోపంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత



ఆందోళనకరంగా ఉంది. ఒకే టీచర్‌తో బహుళ తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి సర్వ సాధారణమవుతోంది. సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే విద్యపై పట్టు కోల్పోతున్నారు. దీని ప్రభావం క్రమంగా పెరిగి విద్యా నాణ్యతను దెబ్బతీస్తోంది. డ్రాప్‌ఔట్ సమస్య మళ్లీ తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. ఒకవైపు ప్రభుత్వం విద్యార్థుల చేరికలను పెంచేందుకు కృషి చేస్తుండగా, మరోవైపు టీచర్ల సరైన కేటాయింపు లేకపోవడం వల్ల అదే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది.

డిప్యూటేషన్ సమస్యను తాత్కాలిక పరిష్కారంగా కొనసాగించడం ఇక సాధ్యం కాదు. ఇది నియంత్రణ లేకుండా సాగితే, విద్యా వ్యవస్థలోని అసలు బలాన్ని దెబ్బతీసే శాశ్వత లోపంగా మారుతుంది. అందుకే ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి.. అవసరం లేని డిప్యూటేషన్లను రద్దు చేయడం, టీచర్లను బోధనకే పరిమితం చేయడం, ఖాళీలను వేగంగా భర్తీ చేయడం అత్యవసరం. అధికారులు ఈ వ్యవస్థను బాధ్యతగా పర్యవేక్షించాలి. టీచర్లు కూడా తమ ప్రాథమిక విధిని గుర్తించి తరగతి గదికి ప్రాధాన్యం ఇవ్వాలి. చివరగా ఒక విషయం స్పష్టం.. పాఠశాలలో టీచర్ లేకపోవడం అంటే ఖాళీ తరగతి మాత్రమే కాదు, అది నేరుగా విద్యార్థి భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన లోటు. ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే, కలిగే నష్టం తిరిగి సరిచేయలేనిది అవుతుంది.

ఉదయ్ కుమార్. జి
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నెంబర్ 8367603197

# ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, ఏప్రిల్ : 23 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) :ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. తాంసి మండలం పొన్నారి గ్రామ శివారులో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మస్టర్ రోల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పన జరగాలని, పనుల నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదని ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కూలీలు చేసిన పనికి తగిన వేతనం అందేలా కొలతలు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున కూలీలు అస్వస్థతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పని ప్రదేశంలోనూ నీడ సౌకర్యం, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పనుల పరిశీలనలో భాగంగా కూలీలతో ముఖాముఖి మాట్లాడుతూ, పని ప్రదేశంలో మీకు కావాల్సిన సౌకర్యాలు అందుతున్నాయా? సకాలంలో వేతనాలు జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, మండల అభివృద్ధి అధికారి మోహన్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీ, సర్పంచ్ భీమన్న, ఏపీఓ విజయ, టెక్నికల్ అసిస్టెంట్ పుష్ప, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ఆర్.సి) హుస్నాబాద్ బస్సు డిపో ముందు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు పలికిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా కార్మికులను అణచివేయడం, కూర్చోవడానికి వేసిన తార్పాలిన్‌లు తొలగించడం సరైంది కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వంలోకి రాకముందు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా మాట్లాడిన వీడియోను విలేకరుల ముందు ప్రదర్శిస్తూ, ఇప్పుడు అధికారంలో ఉన్నందున అదే హామీలను అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణకు అవకాశం కల్పించడం సరైంది కాదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన విలీన ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తాను వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

## బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు



హుస్నాబాద్ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి ఆర్ సి): రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వ ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు వెళితే రోజుల కొద్దీ కొనుగోలు కేంద్రంలోనే గడుపాల్సి వస్తుందని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు అట్టహాసంగా ప్రారంభిశీచినప్పటికీ కొనుగోలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు మేలు చేస్తున్నాం అని గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది ఏమీ లేదని, ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తరువాత వెంటనే మిల్లులు అలాట్ మెంట్ చేయకపోవడం వలన లోడింగ్ లో మిల్లర్స్ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం జరిగి ఒక నెలన్నర గడిచిన 20 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారని, కొనుగోలు కేంద్రంలోనే దాదాపు వెయ్యి కింటాళ్లు ఉన్నాయని, మొక్క జొన్నల కొనుగోళ్లు సరిగా లేకపోవడం వలన రైతుల ఆర్థిక అవసరాల కోసం ప్రవేట్ వ్యాపారుల దగ్గర అమ్ముకొని నష్టపోతున్నారని అన్నారు. ప్రొద్దుతిరుగుడు పంటను అమ్ముకోవడానికి రైతులు అనేక కష్టాలు పడుతు న్నారని, మార్క్ పేడ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం కొంత పంటను కొనుగోలు చేసిందని, మిగిలిన కొంత పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, సంబందించిన అధికారులు చెప్పుతున్నారని అన్నారు. కానీ ప్రొద్దుతిరుగుడును కొనుగోలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి రాలేదని అంటున్నారని అన్నారు. ఇలా కొనుగోలు చేయడంలో ఆలస్యం చేయడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాతావరణ పరిస్థితి వలన రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి కాబట్టి రైతులు నష్ట పోకుండా చూసే బాధ్యత ప్రభుత్వనిదేనని అందుకోసమే కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లును వేగవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎంఎ అన్వర్ పాషా, సీనియర్ నాయకులు వంగ వెంకట్రామ్ రెడ్డి, బండి రమణ రెడ్డి, అలమల్ల ప్రభాకర్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, బూర వెంకన్న గౌడ్, గడ్డం సదానందం, దొంతరబోయిన శ్రీనివాస్, బోడ శ్రీనివాస్ నాయక్, గోపగోని అరవింద్ తదితరుల పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ (తెలంగాణ వాణి ప్రతినిధి): ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ గ్రామీణ మండలం, ద్యాంగాపూర్ ప్రభుత్వ బాలుర ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ కు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ముందుగా పాఠశాలలోని సరస్వతి అమ్మవారి విగ్రహానికి



కలెక్టర్, అధికారులు, పోషకులు కలిసి పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. పోషకులు, తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశాల వల్లనే పాఠశాల ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రగతి వివరాలు కూడా ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులకు తెలుస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలవడం వల్ల పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు అందరూ సెలవులు ముగియగానే సమయానికి పాఠశాలకు రావాలని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ సమస్య తొలగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల నీటి సౌకర్యానికై బోరు వేస్తామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు అన్ని నైపుణ్యాలు, అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించబడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లలందరూ చదువులు, ఆటల్లో అద్భుత ప్రతిభ చాటుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదికలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన, క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ అంబాజీ, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్ లు నవీన్, హరీష్, ఇతర అధికారులు, విద్యార్థుల పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక ఫలితాలు విడుదల చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్




పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) మండల పరిధిలోని ఇంద్రేశం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల చివరి పని దినం సందర్భంగా పాఠశాల వార్షిక ఫలితాలను విడుదల చేశారు. అంతకు ముందు విద్యా శాఖ నిర్ణయం మేరకు పీ టీ ఎం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్నాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పట్లోళ్ళ హరీష్ రెడ్డి హాజరై వార్షిక ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు పాఠశాలలో తరగతి గదుల కొరత ఇతర సమస్యలను ప్రస్తావించగా వాటిని వీలైనంత త్వరగా తీర్చడానికి సహకరిస్తానని హరీష్ రెడ్డి హాజరైన తల్లిదండ్రుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సాయిలు, శారద రేవతి, లక్మణ్ రావు, సునీత, ఎల్లారెడ్డి, మౌనిక, కల్పన, లాస్య, సుచరిత, శిరీష, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

## స్మార్ట్ ఫోన్ కు అలవాటుపడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దు
## పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, ఏప్రిల్ 23 : (తెలంగాణ వాణి ప్రతినిధి): వేసవి సెలవులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థులకు సూచించారు. సెలవులను ఉల్లాసంగా గడుపుతూ, ఇష్టమైన రంగంలో ప్రతిభను మరింతగా మెరుగుపర్చుకునేలా కృషి చేయాలని హితవు పలికారు. డిచ్పల్లి మండలం సుద్దపల్లిలో గల సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్ కు కలెక్టర్ ముఖ్య అతిథిగా

వార్షిక ఫలితాలు విడుదల చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్

పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) మండల పరిధిలోని ఇంద్రేశం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల చివరి పని దినం సందర్భంగా పాఠశాల వార్షిక ఫలితాలను విడుదల చేశారు. అంతకు ముందు విద్యా శాఖ నిర్ణయం మేరకు పీ టీ ఎం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇస్నాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పట్లోళ్ళ హరీష్ రెడ్డి హాజరై వార్షిక ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు పాఠశాలలో తరగతి గదుల కొరత ఇతర సమస్యలను ప్రస్తావించగా వాటిని వీలైనంత త్వరగా తీర్చడానికి సహకరిస్తానని హరీష్ రెడ్డి హాజరైన తల్లిదండ్రుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సాయిలు, శారద రేవతి, లక్మణ్ రావు, సునీత, ఎల్లారెడ్డి, మౌనిక, కల్పన, లాస్య, సుచరిత, శిరీష, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విచ్చేసి, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో భేటీ అయ్యారు. నేటి నుండి వేసవి సెలవులు లభించగా, సెలవులలో ఏం చేస్తారని విద్యార్థులను వారి ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు. స్విమ్మింగ్, కరాటే, డ్యాన్స్, సంగీతం వంటి వాటిలో తమ అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వీలైతే చారిత్రక ప్రదేశాలను సందర్శించాలని అన్నారు. సెలవులను వృథా చేసుకోవద్దని, స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని, వారంలో అర గంటకు మించి పిల్లలు స్మార్ట్ ఫోన్ వినియోగించకుండా చూడాలన్నారు. బాలికల పట్ల వివక్షత చూపకుండా వారిని ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్ లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థినులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ నళిని, తహసీల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 'జబర్దస్త్'కు రీఎంట్రీ ఇచ్చిన నాగబాబు..




ఒకప్పుడు తెలుగు టెలివిజన్‌లో టాప్ రేటింగ్స్‌తో దూసుకెళ్లిన ప్రముఖ కామెడీ షో 'జబర్దస్త్', గత కొంతకాలంగా తన ప్రభావాన్ని కోల్పోయింది. పడిపోయిన రేటింగ్స్‌తో వెనుకబడిన ఈ షోకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చేందుకు నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా షోకు మొదటి నుంచి పెద్ద దిక్కుగా ఉన్న ప్రముఖ నటుడు నాగబాబును తిరిగి జడ్జ్‌గా తీసుకువచ్చారు. నాగబాబు రాకతో షోలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. "ఈ కుర్చీ ఎప్పటికీ మీదే సార్" అంటూ యాంకర్ రష్మీ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. తాను షోలో లేకపోయినా ఎప్పుడూ దాని గురించే ఆలోచించేవాడినని, ఎవరైనా తప్పు చేస్తే సెట్‌కు వచ్చి మందలించాలనిపించేదని అన్నారు. ఆయన మాటలు ఈ షోపై తనకున్న అనుబంధాన్ని తెలియజేశాయి. నాగబాబు నవ్వులు టీమ్‌లో కొత్త ఎనర్జీ నింపుతున్నాయని కమెడియన్లు చెబుతున్నారు. ప్రస్తుతం షోలో కొత్త కమెడియన్లు ఎక్కువగా ఉండగా, ఈ అంశాన్ని కూడా స్కిట్లలో సరదాగా ప్రస్తావిస్తున్నారు. మరోవైపు బుల్లెట్ భాస్కర్ స్కిట్‌లో "నేను ఏమైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అయ్యానా?" అంటూ వేసిన పొలిటికల్ సెటైర్ కూడా బాగా పేలింది. దీంతో భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని ఉండొచ్చని ప్రేక్షకులు అంచనా వేస్తున్నారు. నాగబాబు తన పాత టీమ్‌ను, ముఖ్యంగా చమ్మక్ చంద్ర వంటి వారిని మళ్లీ వెనక్కి తీసుకొస్తారా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ మార్పులతో జబర్దస్త్ మళ్లీ తన పాత స్థానాన్ని దక్కించుకుంటుందో లేదో చూడాలి.




## తమన్నాతో బ్రేకప్ తర్వాత..

# విజయ్ వర్మ లైఫ్‌లో కొత్త టర్న్..



సినీ పరిశ్రమలో ప్రేమలు, బ్రేకప్‌లు కొత్త విషయం కాదు. కానీ కొన్ని జంటలు విడిపోతే మాత్రం అభిమానులకు జీర్ణించుకోవడం కష్టమే. అలాంటి జంటల్లో విజయ్ వర్మ – తమన్నా భాటియా ఒకటి. దాదాపు రెండేళ్ల పాటు గాఢమైన ప్రేమలో ఉన్న ఈ జంట త్వరలో పెళ్లి చేసుకుంటారని అభిమానులు భావించారు. అయితే అనూహ్యంగా వీరిద్దరూ విడిపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇద్దరూ కలిసి నటించిన లస్ట్ స్టోరీస్ 2 షూటింగ్ సమయంలోనే దగ్గరయ్యారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో తమ సంబంధాన్ని పరోక్షంగా అంగీకరించారు. అయితే 2025 ప్రారంభం నుంచి వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయని వార్తలు వినిపించాయి. ముఖ్యంగా పెళ్లి విషయంలో అభిప్రాయ భేదాలే బ్రేకప్‌కు కారణమని బీటౌన్‌లో టాక్ వినిపించింది. తమన్నా తన సోషల్ మీడియా ఖాతాల నుంచి విజయ్‌తో ఉన్న ఫోటోలను తొలగించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. 2025 మార్చి నాటికి వీరిద్దరూ అధికారికంగా విడిపోయినట్లు సమాచారం. తమన్నాతో విడిపోయిన కొద్ది కాలానికే విజయ్ వర్మ మరో నటితో కలిసి తిరుగుతుండడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముంబైలో విజయ్ వర్మ, అలియా ఖురేషితో కలిసి డిన్నర్‌కు వెళ్లిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇద్దరూ కలిసి బయటకు రావడం, ఒకే కారులో వెళ్లడం వంటి విజువల్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. గతంలో విజయ్ వర్మ, ఫాతిమా సనా షేక్‌తో డేటింగ్ చేస్తున్నారనే రూమర్స్ కూడా వినిపించాయి. అయితే తాజా పరిణామాలతో అలియా ఖురేషితో కొత్త బంధం మొదలైందా? అనే అనుమానాలు నెటిజన్లలో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం విజయ్ నటిస్తున్న 'మట్కా కింగ్' సిరీస్‌లో అలియా కూడా భాగం కావడం గమనార్హం. షూటింగ్ సమయంలో ఏర్పడిన పరిచయం మరింత దగ్గరగా మారిందనే ప్రచారం జరుగుతోంది. అలియా ఖురేషి బాలీవుడ్‌లో ఎదుగుతున్న యువ నటి. షారుఖ్ ఖాన్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం జవాన్‌లో కీలక పాత్రలో కనిపించింది. అందులో 'జాన్వి' పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. నటిగానే కాకుండా, అలియా ఒక మంచి గాయని, సాంగ్ రైటర్ కూడా. వెబ్ సిరీస్‌ల ద్వారా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తోంది. ప్రస్తుతం విజయ్ వర్మ, అలియా ఖురేషి డేటింగ్ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటనలేదు. ఇవి కేవలం రూమర్స్ మాత్రమేనా, లేక నిజంగానే కొత్త ప్రేమ కథ మొదలైందా అన్నది తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

## 29 ఏళ్లకే కన్నుమూసిన నటి దివ్యాంక సిరోహి..

# ఆకస్మిక మృతితో షాక్‌లో చిత్ర పరిశ్రమ



ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువ నటి దివ్యాంక సిరోహి 29 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. డిగ్రీ పూర్తి చేసిన దివ్యాంక సిరోహి ప్రస్తుతం ఘజియాబాద్లో తన కుటుంబంతో కలిసి నివసిస్తోంది. చిన్న స్థాయి నుండి కెరీర్ ప్రారంభించిన ఆమె, ఉత్తరప్రదేశ్ మరియు హర్యానా ప్రాంతాల్లో లోకల్ భాషల మ్యూజిక్ ఆల్బమ్స్‌లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాదాపు 50కి పైగా మ్యూజిక్ వీడియోల్లో నటించిన ఆమె, తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమాల్లో కూడా చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ, హీరోయిన్‌గా ఎదగాలని కృషి చేస్తున్న సమయంలోనే ఈ విషాదం చోటుచేసుకోవడం బాధాకరం. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉండేది. తరచూ తన ఫోటోలు, వీడియోలతో అభిమానులతో టచ్‌లో ఉండేది. ఏప్రిల్ 21 మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స అందుకుంటూనే ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ వార్తతో ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. దివ్యాంక సిరోహి మరణం ఉత్తరప్రదేశ్, హర్యానా సంగీత పరిశ్రమలో కూడా తీవ్ర విషాదాన్ని నింపింది. అనేకమంది సెలబ్రిటీలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు. యువ ప్రతిభావంతురాలు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడం అందరినీ కలచివేస్తోంది. బాలీవుడ్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలలు కంటున్న సమయంలోనే ఆమె ప్రయాణం ముగియడం నిజంగా విషాదకరం. నిన్న మధ్యాహ్నం ఘజియాబాద్లో ఆమె అంత్యక్రియలు నిర్వహించగా, భారీగా అభిమానులు హాజరై కన్నీటి నివాళులు అర్పించారు. దివ్యాంక సిరోహి ఇలా చిన్న వయస్సులో మృతి చెందడం ఆమె కుటుంబానికి, అభిమానులకు ఇది తీరని లోటుగా మిగిలిపోయింది.

# అప్పులు తీరేనా.. స్లమ్‌డాగ్ వచ్చేనా!



టాలీవుడ్‌లో ఒకప్పుడు సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు..స్టార్ హీరోలందరి హాట్ ఫేవరెట్.. అంటే ముందు వినిపించే పేరు పూరీ జగన్నాథ్. ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న పూరీ ఎంత పెద్ద సినిమాను అయినా చాలా తక్కువ సమయంలో పూర్తి చేయడంలో దిట్ట. అప్పట్లో పూరీ సినిమా అంటే చాలు బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురవాల్సిందే. అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రస్తుతం ఈ సెన్సేషనల్ డైరెక్టర్ కెరీర్‌లోనే అత్యంత క్లిష్టమైన బ్యాడ్ టైమ్‌ను ఫేస్ చేస్తున్నారు. ఆయన సృష్టించిన వండర్స్ ఒక వైపైతే.. ఇప్పుడు ఆయన చుట్టూ ఉన్న వివాదాలు, ఆర్థిక ఇబ్బందులు మరోవైపు ఉన్నాయి. ముఖ్యంగా స్లమ్‌డాగ్ సినిమా చుట్టూ ఇప్పుడు నెలకొన్న పరిస్థితులు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. 'లైగర్' సినిమాతో అసలు సమస్య మొదలైంది. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ అంచనాలతో వచ్చిన ఆ చిత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆ సినిమా నష్టాల వల్ల డిస్ట్రిబ్యూటర్లు రోడ్డున పడ్డారు. ఆ సమయంలో వారికి కొంత వరకు బాధ్యత వహిస్తానని, నష్టపరిహారం అందిస్తానని పూరీ హామీ ఇచ్చారు. కానీ, ఆ తర్వాత ఎంతో నమ్మకంతో చేసిన డబుల్ ఇస్మార్ట్ కూడా బాక్సాఫీస్ వద్ద చేతులెత్తేసింది. దీంతో డిస్ట్రిబ్యూటర్ల కష్టాలు రెట్టింపు అయ్యాయి. మొదటి సినిమా నష్టాలే తీరలేదు అనుకుంటే, రెండో సినిమా కూడా దెబ్బకొట్టడంతో తలనొప్పులు మళ్లీ మొదటికి వచ్చాయి. ఇప్పుడు అసలు కథ స్లమ్‌డాగ్ దగ్గరికి వచ్చింది. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో పూరీ తెరకెక్కించిన ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. ఈ కాంబినేషన్ మీద ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. కానీ, సినిమా రిలీజ్ చేయడానికి పూరీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాత బకాయిలు తీరిస్తేనే ఈ సినిమాను థియేటర్లలోకి రానిస్తాం అంటూ డిస్ట్రిబ్యూటర్లు భీష్మించుకుని కూర్చున్నారు. థియేటర్ రిలీజ్ మాత్రమే కాదు, ఓటీటీ డీల్స్ విషయంలో కూడా ఇదే నిబంధన అడ్డుపడుతోంది. బకాయిలు క్లియర్ చేయకుండా ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కూడా ముందడుగు వేయడం లేదు. ప్రస్తుతం పూరీ ఈ ఆర్థిక సమస్యలను అధిగమించే పనిలో బిజీగా ఉన్నారు. ఎలాగైనా పాత అప్పులను క్లియర్ చేసి, స్లమ్‌డాగ్ సినిమాను ప్రేక్షకులకు అందించాలని చూస్తున్నారు. తన మార్కు డైలాగులతో, క్యారెక్టరైజేషన్‌తో మ్యాజిక్ చేసే పూరీ.. ఈ రియల్ లైఫ్ క్రైసిస్ నుంచి ఎలా బయట పడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒక సినిమా సక్సెస్ అయితేనే ఈ సమస్యలన్నీ తొలగిపోతాయి.

మరి విజయ్ సేతుపతి సినిమా పూరీకి ఆ ఊపిరిని ఇస్తుందో లేదో చూడాలి. ఏది ఏమైనా, పూరీ జగన్నాథ్ లాంటి ప్రతిభావంతుడైన దర్శకుడు మళ్ళీ తన ఫామ్ అందుకుని, మునుపటి వైభవాన్ని చూడాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. విజయ్ సేతుపతి లాంటి వెర్సటైల్ యాక్టర్ పూరీ విజన్ కలిస్తే ఎలా ఉంటుందో చూడాలని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ప్రభాస్ అభిమానిపై దాడి..

# సుదర్శన్ థియేటర్ వద్ద ఉద్రిక్తత.. అసలేం జరిగింది?




హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. 'రెబల్ స్టార్' ప్రభాస్ నటించిన 'డార్లింగ్' సినిమా విడుదలై 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 4K వెర్షన్‌లో గ్రాండ్ గా రీ రిలీజ్ చేయగా.. ఈ వేడుకలతో థియేటర్ ప్రాంగణం ఒక్కసారిగా రణరంగంగా మారింది. ఈ ఘటనలో థియేటర్ యాజమాన్యం ఒక అభిమానిపై దాడికి పాల్పడటం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ గొడవకు సంబంధించి రెండు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. సినిమాలోని కొన్ని పాటలను మేనేజ్‌మెంట్ కట్ చేయడంతో, దానిని ప్రశ్నించినందుకు తమపై సిబ్బంది చేయి చేసుకున్నారని అభిమానులు ఆరోపిస్తుండగా.. మరోవైపు, సదరు వ్యక్తి మద్యం మత్తులో అక్కడి మహిళా సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తించాడని, మిడిల్ ఫింగర్ చూపిస్తూ దుర్భాషలాడటం వల్లే తాము స్పందించాల్సి వచ్చిందని థియేటర్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం బాధితురాలికి యాజమాన్యం చికిత్స అందిస్తూనే, నిందితుడిపై కఠిన చర్యలకు డిమాండ్ చేస్తోంది. ఇక భారీ రెస్పాన్స్‌తో హౌస్‌ఫుల్ షోలతో సాగుతున్న ఈ వేడుకల్లో ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగడం పట్ల అటు అభిమానులు, ఇటు సినిమా వర్గాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# గవర్నర్ పైనే రేవంత్ ఆశలన్నీ



హైదరాబాద్, :తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడుఅందరి దృష్టి లోక్‌భవన్ వైపే ఉంది. మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండ రాంల ఎమ్మెల్సీ నామినేషన్ల ఫైల్ క్లియరెన్స్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం సమావేశం అయ్యారు. కానీ క్లారిటీ రాలేదు. దాంతో మరోసారి కేబినెట్ ద్వారా సిఫారసు చేయాలని అనుకుంటున్నారు. తెలంగాణ కేబినెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న మహ్మద్ అజారుద్దీన్‌కు ఇప్పుడు సమయం చాలా తక్కువగా ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోపు శాసనసభ లేదా శాసనమండలిలో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. అజహర్ విషయంలో ఆ గడువు ఏప్రిల్ 30, 2026తో ముగియనుంది. అంటే పది రోజులు కూడా గడువు లేదు. ఎమ్మెల్సీగా ఖరారు కాకపోతే, మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం అజహర్ వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, రేవంత్ రెడ్డి ప్రతిష్టకు కూడా ఒక సవాల్‌గా మారింది. ఈ అంశంపై కొంతకాలంగా లోక్‌భవన్‌కు, ప్రభుత్వానికి మధ్య ఉన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు రేవంత్ రెడ్డి సయోధ్య మార్గాన్ని ఎంచుకున్నారు. గవర్నర్‌తో జరిగిన భేటీలో ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని, అజారుద్దీన్ విషయంలో ఉన్న రాజ్యాంగపరమైన అత్యవసర పరిస్థితిని సీఎం వివరించినట్లు తెలుస్తోంది. గతంలో గవర్నర్ కోటా నామినేషన్లపై కోర్టు కేసులు, సాంకేతిక అడ్డంకులు ఉన్నాయని.. ఇప్పుడు సుప్రీంకోర్టు నుండి కూడా సానుకూల సంకేతాలు ఉన్నాయని గవర్నర్‌కు తెలియజేశారు. రాజ్‌భవన్‌తో ఘర్షణ కంటే చర్చల ద్వారానే పనులు పూర్తి చేసుకోవాలనేది రేవంత్ మార్క్ వ్యూహంగా కనిపిస్తోంది. గతంలో సిఫారసు చేసినప్పుడు ప్రస్తుత గవర్నర్ లేరు. పాత గవర్నర్ ఉన్నప్పుడు కేబినెట్ చేసిన సిఫారసులు కొత్త గవర్నర్ ఆమోదిస్తారో లేదో క్లారిటీ లేదు. అందుకే సీఎం రేవంత్ మళ్లీ కేబినెట్ భేటీ ఏర్పాటు చేసి.. మరోసారి సిఫారసు చేయాలని అనుకుంటున్నారు. అప్పుడు గవర్నర్ నిర్ణయం తీసుకుంటారని అనుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సమయంలో మైనారిటీ నేతగా అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి ఒక పెద్ద రాజకీయ సందేశాన్ని ఇచ్చారు. ఇప్పుడు ఆయన పదవిని కాపాడలేకపోతే, అది ప్రభుత్వంపై , ముఖ్యంగా సీఎం నాయకత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. గవర్నర్ క్లియరెన్స్ రాకపోతే ప్లాన్-బి గా అజహర్‌ను మరోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడం లేదా హైకోర్టును ఆశ్రయించడం వంటి ఇతర ప్రత్యామ్నాయాలను కూడా ప్రభుత్వం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. అయితే, గవర్నర్ ఈ వారంలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటారని రేవంత్ ధీమాగా ఉన్నారు. ఈ వారం ముగిసేలోపు ఎమ్మెల్సీ స్పష్టత వస్తే రేవంత్ రెడ్డి రాజకీయంగా మరో విజయం సాధించినట్లవుతుంది. ఒకవేళ జాప్యం జరిగితే, ఏప్రిల్ 30 లోపు అజహర్ రాజీనామా చేయాల్సి రావడం ప్రతిపక్షాలకు ఒక బలమైన అస్త్రంగా మారుతుంది. అజహర్ మంత్రి పదవిని కాపాడటం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్న రేవంత్ రెడ్డి, గవర్నర్ కోటా ఫైల్ పై సంతకం చేయించడంలో ఎంతవరకు సఫలమవుతారో చూడాలి.

## అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



కరీంనగర్ (తెలంగాణ వాణి) కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా డి. శ్రీనివాస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు రేరాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గా నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై పలు అంశాలు చర్చించారు. ఆర్డీఓ కె. మహేశ్వర్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు శ్రీనివాస్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ నరేందర్, రాజేష్, కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి పట్టుదల సేవాభావం ప్రతి ఒక్కరికి ఆదర్శం

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచ్చుకుళ్ళ దామోదర్ రెడ్డి



నాగర్ కర్నూల్ (తెలంగాణ వాణి): కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మహర్షి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతు భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుడు చరిత్రలో నిలిచిపోయారని అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. లక్ష్యం పట్ల అంకితభావం, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుని జీవితం యువతకు గొప్ప సందేశమని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని భగీరథుని ఆశయాలకు అనుగుణంగా సమాజంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతు భగీరథుడు భూమిపైకి గంగను తెచ్చిన మహనీయుడని, వారి త్యాగనిరతి, పట్టుదల ఆదర్శనీయమని ఎమ్మెల్సీ కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భగీరథుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సగర కుల సంఘాల ప్రతిపాదనలను ఎమ్మెల్సీ దావెూదర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నాగర్ కర్నూల్ పట్టణంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తామని హామీ ఇచ్చారు. సగర కుల సంఘ నాయకులు వక్తలు మాట్లాడుతూ భగీరథుని స్మరిస్తూ, విగ్రహాన్ని సగరకుల భవనాన్ని ఏర్పాటుకు, కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్,18వ వార్డు కౌన్సిలర్ చంద్రకళ సాగర్ సాగర సంఘం నాయకులు అల్లం రాముడు ,సీనియర్ జర్నలిస్టు సాయిలు సాగర్, లక్ష్మణ్ సాగర్ ,టౌన్ అధ్యక్షులు బాలయ్య సాగర్ , బంగారయ్య సాగర్ , సూరంపల్లి సుధాకర్ సాగర సంఘం నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడితో ఎంతో మందికి పునర్జన్మ నిచ్చిన..

# యశోద హాస్పిటల్




కరీంనగర్ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి) హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగంలో అరుదైన రికార్డును ప్రముఖ నెఫ్రాలా జిస్ట్ డాక్టర్ రాజశేఖర్ చకవర్తి మరియు వారి బృంద ఇప్పటి వరకు 346 కిడ్నీ మార్పిడి శాస్త్రదేశం అత్యంత విజయవంతగా నిర్వహించి ఎంతో మంది భాదతులకు పునర్జన్మ ప్రసాదించాడు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య నిపుణులు కిడ్నీ మార్పిడిలో తాము సాదించిన విప్లవాత్మక పురోగతిని వివరించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్త గ్రూపులు కలవడం ప్రధానం అయితే, యశోద హాస్పిటల్స్ బృందం బ్లడ్ గ్రూప్ వేరుగా ఉన్న రోగులకు (ఏఓబి ఇన్కంప్లేటిబ్లె ట్రాన్స ప్లంట్) కూడా విజయవంతంగా కిడ్నీ మార్పిడి నిర్వ హించి వారు ప్రస్తుతం ఆరోగ్య కరమైన జీవితాన్ని గడిపేలా చేయడంలో విజయం సాధించింది. వయోభారంతో సంబంధం లేకుండా చికిత్స శస్త్రచికిత్సల విషయంలో వయస్సు ఒక అడ్డంకి కాదని యశోద వైద్యులు నిరూపించా రు. 60 ఏళ్లు పైబడిన వృద్ధు లలో కూడా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవం తం పూర్తి చేసి,వారి ఆయుష్షు ను పెంచడంలో కీటక పాత్ర పోషించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితు ల్లో కూడా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఈ మైలురాయి ని చేరు కోవడం పట్లహర్షం వ్యక్తం చేశాడు. ఈ సందర్భం గా డాక్టర్ జశ్వంత్ చల్లా మాట్లాడుతూ కిడ్నీ వైపల్యం తో బాధపడి రోగులకు డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే కానీ కిడ్నీ మార్పిడి వల్ల రోగుల జీవన ప్రమాణా లు గణనీయంగా మెరుగుపడ తాయి. మా బృందం సాదిం చిన ఈ 346 ట్రాన్స్ప్లాంట్లు కేవలం సంఖ్య మాత్రమే కాదు 346 కుటుంబాల్లో నిండిన వెలుగులు అని అన్నారు. రక్త గూపులు వేరైనా కిడ్నీ మార్పి డి సాధ్యమే అన్న అవగాహన ప్రజల్లో పెరగాలని పేర్కొ న్నారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సిటీ యూనిట్ అత్యాధునిక మౌలిక సదుపా యాలు మరియు అనుభ వజ్ఞులైన వైద్య బృందంతో కిడ్నీ సంబంధిత వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి చికిత్స లను అందిస్తూ దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్ గా ఎదుగుతోందని వైద్యులు జశ్వంత్ తెలిపారు.

### రెండో రోజూ కరీంనగర్ బస్టాండ్‌లో..

# ప్రయాణికుల కష్టాలు





కరీంనగర్ : ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకి చేరడంతో కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇబ్బందులు మరింత పెరిగాయి. బస్సులు అందుబాటులో లేకపోవడంతో వందలాది మంది ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లోనే వేచి చూస్తూ తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర పనుల కోసం బయలుదేరినవారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమ్మె కారణంగా పలు రూట్లలో బస్సులు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఆందోళన చెందుతున్నారు. కొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా, అధిక చార్జీలతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, కొన్ని చోట్ల ప్రైవేటు డ్రైవర్లను పెట్టి బస్సులను నడిపిస్తున్నట్లు సమాచారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. బస్టాండ్‌లో సరైన సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. ఎప్పుడు బస్సులు నడుస్తాయో స్పష్టత లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం స్పందించి సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. సమ్మె కొనసాగితే పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్టీసీ సమ్మె శాంతియుతంగా సాగాలి..

### అల్లర్లకు తావిస్తే కఠిన చర్యలు
### పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



కరీంనగర్ : కరీంనగర్‌లో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సమ్మె ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ అది పూర్తిగా శాంతియుత వాతావరణంలోనే జరగాలని స్పష్టం చేశారు. ప్రజా అశాంతి సృష్టించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమ్మె కారణంగా సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలను వినియోగించే వారికి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మరియు రవాణా వ్యవస్థపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా, లేదా ఆర్టీసీ సిబ్బంది తిరిగి డ్యూటీలో చేరినా వారికి ఎలాంటి బెదిరింపులు లేకుండా పూర్తి స్థాయి భద్రత కల్పిస్తామని చెప్పారు. బస్టాండ్లు, డిపోలు, ప్రధాన కూడళ్ల వద్ద అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం, అధికారులపై దాడులు వంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, వదంతులు వ్యాప్తి చేసే వారిపైనా నిఘా ఉంచినట్లు తెలిపారు. సమ్మెలో పాల్గొనే కార్మికులు పరస్పర గౌరవంతో వ్యవహరించాలని, ఉద్రిక్తతలకు తావు లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు చేపడితే చట్టపరమైన చర్యలతో పాటు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరుతూ, అనుమానాస్పద పరిస్థితులు గమనించినా లేదా బస్సులు నడిపే డ్రైవర్లను బెదిరించిన ఘటనలు ఎదురైనా వెంటనే స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670713కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# జనగణన కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఎం ప్రకాష్



ములుగు (తెలంగాణ వాణి) జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఎం. ప్రకాష్ ఎన్యుమరేటర్స్/సూపర్ వైజర్లుకు తెలిపారు. గురువారం మొదటిరోజు మున్సిపాలిటీ ములుగు జనగణన,ఇండ్ల గణన శిక్షణ కార్యక్రమాన్ని ఆర్ అండ్ బి గేస్ట్ హౌస్ ములుగులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళికా అధికారి మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, మొత్తము 33 ప్రశ్నలతో కూడిన వివరాలు ఉంటాయని ప్రతి ప్రశ్నకు తగిన సమాదానాన్ని సరిగా నమోదు చేయాలన్నారు. తొలుత మే 11 నుంచి జూన్ 9వరకు సర్వే చేపడతామని ఆ తర్వాత రెండో విడత 2027 ఫిబ్రవరిలో జనాభా గణన సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారాహొచేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# మర్యాద పూర్వకంగా కలిసిన నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు



హనుమకొండ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి స్టాఫ్ రిపోర్టర్): హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో వరంగల్ ఎంపీ కడియం కావ్య ని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చకిలం ఉపేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలు, కోర్టు సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు న్యాయసేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం వంటి అంశాలపై చర్చించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఎంపీ కావ్య హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమం, కోర్టుల మౌలిక వసతుల పెంపు కోసం తన వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చకిలం ఉపేందర్‌తో పాటు సభ్యులను ఎంపీ అభినందించారు. వారు న్యాయవాదుల హక్కుల పరిరక్షణలో, ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందించడంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు లలిత కుమారి, సాంబశివరాజు తదితర కీలక సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com